
Licensed to post without Prepayment No. J/Nellore/003/15-17 R.N.I.No.25359/74 - PLG/NL/9-10/03
నెల్లూరు, 01.04.2016, శుక్రవారం సంపుటి : 35 సంచిక : 44 పేజీలు : 12, వెల : ₹ 5




# లాయర్

వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంగ్రాహకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి
www.lawyerteluguweekly.com

తిండి తిప్పలకు కూడా ఏ మాత్రం చాలని వేతనాలను అందుకునే కష్టజీవులు అంగన్‌వాడీ వర్కర్‌లు. కొద్దిగా తమ వేతనాలను పెంచమని ధర్నాలు చేస్తే గుర్రాలతో తొక్కిస్తారు, లాఠీలతో బాధేస్తారు. తమ జీతాలు పెంచమని ఆరోగ్య సిబ్బంది అడిగితే ఉన్న ఉద్యోగాలనే ఊడదీస్తారు. ఎండనకా వాననకా, రేయనకా పగలనకా డ్యూటీలు చేసే పోలీసులైతే తమ జీతాలు పెంచమని ఈ విధంగా రోడ్లు కూడా ఎక్కలేరు. ఈ దేశంలో ఏ శాఖకు చెందిన ఉద్యోగులు, సిబ్బందికైనా ఆందోళనలు చేయకుండా, ఉద్యమాలకు దిగకుండా, లాఠీ దెబ్బలు తినకుండా ప్రభుత్వాలు జీతాలు పెంచిన దాఖలాలు లేవు. మరి జీతాలు పెంచాలంటే ఇందరు ఇన్ని విధాలుగా కష్టపడుతుంటే, మన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు మాత్రం ఎలాంటి శ్రమ లేకుండానే జీతాలు పెరుగుతుంటాయి. ఎందుకంటే అది వారి చేతుల్లో పనే కదా!



## ఈ 'పేదోళ్లు'
# జీతాలు పెంచుకున్నారు

- ప్రజలకు త్యాగాలు... నేతలకు భోగాలు
- రాష్ట్రంలో ఆర్థికలోటు... సభ్యుల సౌకర్యాలకు రూటు

మన ఎమ్మెల్యేలలో చాలా మంది తిండి గింజలకు కూడా గతిలేని పేదలున్నారేమో... రాష్ట్ర ప్రభుత్వం దయతలచి ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల జీతాలను పెంచేసింది. జీతాల పెంపుకు సంబంధించిన బిల్లును సభలో ప్రవేశపెట్టినప్పుడు ఓ అధికార పార్టీ సభ్యుడు... ఎమ్మెల్యేలలో తిండికి టికాణాలేని పేదలున్నారని, కాబట్టి జీతాల పెంపు ఆవశ్యమని చెప్పడం చిత్రాతి విచిత్రం. 2014ఎన్నికల్లో ఎమ్మెల్యేలుగా గెలవడానికి ఎవరెవరు ఎన్నెన్ని కోట్లు ఖర్చు పెట్టారన్నది వారి ఆత్మసాక్షులకు తెలుసు. (మిగతా 11వ పేజీలో)



## వ్యతిరేకించిన
# ఒకే ఒక్కడు!

శాసనసభ్యుల జీతాల పెంపు బిల్లును ఖరాఖండీగా వ్యతిరేకించిన ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి. ఆ బిల్లుకు అధికార, విపక్ష సభ్యులు హోల్‌సేల్‌గా మద్దతు తెలిపినా కోటంరెడ్డి మాత్రం తనదైన శైలిలో విరుచుకుపడ్డారు. జీతాల బిల్లుపై ఆయన చేసిన ప్రసంగానికి ప్రముఖులు, మేధావుల నుండే కాదు, సామాన్య ప్రజల నుండి సైతం ప్రశంసలు లభిస్తున్నాయి.

# భారత్ టు బంగ్లా...

నెరవేరిన కల

- వినూత్న ఒప్పందానికి వేదికైన కృష్ణపట్నం

12లో



## వెలిగిన తెలుగు సినిమా
# శెభాష్ రాజమౌళి

- ఫలించిన 63ఏళ్ల నిరీక్షణ

తెలుగోడు ఇప్పుడు కాలరెగిరేయొచ్చు... అత్యద్భుత చిత్రాలు నిర్మించే సత్తా మనకుందని. తెలుగోడు గర్వంగా చెప్పొచ్చు... బాలీవుడ్, హాలీవుడ్‌లను తలదన్నే సినిమాలను నిర్మించగలమని. తెలుగోడు ధైర్యంగా సవాల్ చేయొచ్చు... (మిగతా 11వ పేజీలో)











# కనుపూరులో భక్తజన జాతర





శ్రీసిటి వారి సౌజన్యంతో మజ్జిగ ప్యాకెట్ల పంపిణీ

నెల్లూరుజిల్లా చిల్లకూరు మండలం తూర్పుకనుపూరులో వేంచేసియున్న కనుపూరు ముత్యాలమ్మ తల్లి దర్శనానికి జిల్లా నలుమూలల నుండే కాకుండా ఇతర రాష్ట్రాల నుండి భక్తులు తరలివచ్చారు. కోర్కెలు తీర్చే కల్పవల్లి, కరుణించి కాపాడమ్మ అంటూ భక్తులు మొక్కుకున్నారు. నెత్తిమీద పెట్టుకున్న వేయికండ్ల కుండ, అందులో గండదీపం, వేపచీర, పడిగళ్ళు ఏర్పాట్లను పర్యవేక్షించారు. నవధాన్యాలు, ఎర్రగడ్డలు గుడిపైకి విసిరి భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. పోలేరమ్మ అమ్మ వారిని ఊరేగింపుగా తీసుకువచ్చి ప్రతిష్టించారు. పోలేరమ్మ మట్టి ప్రతిమతో పాటు సత్తి పోలేరమ్మ, అంకమ్మ, సిద్దయ్య, పరశురాముడు విగ్రహాలను ఊరేగించారు. సాయంత్రం యార, శ్రీ గురునాథస్వామి, అంకమ్మ దేవతల గ్రామోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఆలయ కార్య నిర్వహణాధికారి ఆర్యభూమి వెంకట శ్రీనివాసులురెడ్డి, భక్తజన సేవాబృందం కమిటి సభ్యులు ఉత్సవ ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఇన్‌ఛార్జి డిఎస్పీ శ్రీనివాసాచారి, సిఐ శ్రీనివాసులురెడ్డి, ఎస్సై అంకమ్మల ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.

# అలరిస్తున్న త్యాగరాజ సంగీతోత్సవాలు

భిక్షాటనపూర్వక శ్రీ త్యాగరాజ స్మరణోత్సవ సభ ఆధ్వర్యంలో 51వ త్యాగరాజ స్మరణోత్సవాలు సోమవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. నెల్లూరు వేదాయపాళెం శ్రీ త్యాగరాజ మందిరం నుండి ఉదయం 7గంటలకు శ్రీ సీతారామలక్ష్మణ హనుమత్సమేత శ్రీ త్యాగరాజ ఉత్సవ విగ్రహాలను, శ్రీ త్యాగరాజ స్వామి వారి చిత్రపటాన్ని మేళతాళాలతో మంగళవాయిద్యాలతో ఊరేగింపుగా టౌన్‌హాలు ఆవరణంలోకి తీసుకువచ్చి శ్రీ స్వామి వార్ల విగ్రహ ప్రతిష్ట, కలశస్థాపన తదితర పూజాదికార్యక్రమాలను వైభవంగా నిర్వహించారు. ప్రతిరోజు ఉదయం నుండి సాయంత్రం వరకు హరికథలు, స్థానిక కళాకారుల గాత్ర కచేరీలు ఆకట్టుకుంటున్నాయి. సోమవారం రాత్రి చెన్నై వసుధా రవి అండ్ పార్టీ వారు నిర్వహించిన గాత్రకచేరి, మంగళవారం చెన్నై గాయత్రి గిరీష్ త్యాగరాజ కృతుల గానంతో ప్రేక్షకులను సమ్మోహితులను చేశారు. వివిధ రాగాలతో ఆలపించిన కీర్తనలు సంగీతాభిమానుల కరతాళధ్వనులు అందుకున్నాయి. బుధవారం రాత్రి చెన్నైకు చెందిన సాత్విక వైద్యనాథన్ అండ్ పార్టీ వారిచే నిర్వహించిన గాత్రకచేరి వీనుల విందుగా సాగింది. ఈ కార్యక్రమాలను స్మరణోత్సవ సభ శాశ్వత కార్యదర్శి డా॥ యనమండ్ర నాగదేవీ ప్రసాద్ తదితరులు పర్యవేక్షించారు.

***రూ.60వేలు విరాళం:*** శ్రీ త్యాగరాజ స్వామి ఉత్సవాలకు శ్రీమతి పులిగొండ్ల కామేశ్వరి, కృష్ణమూర్తి జ్ఞాపకార్థం వారి కుమార్తె మైలవరపు పద్మాషిణి, వాసుదేవ్‌మూర్తి దంపతులు రూ.60వేలు విరాళాన్ని నిర్వాహకుడు యనమండ్ర నాగదేవీ ప్రసాద్‌కు అందజేశారు.

# మేం మారమంటే మారం

- **అవినీతి ఉద్యోగుల తీరిది**
- **ఏసిబికి చిక్కిన దుత్తలూరు తహాశీల్దార్**




**ఏసిబి ఎన్ని దాడులు చేసినా, ఎంతమంది అవినీతి అధికారులను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నా... మాదారి అడ్డదారి అవినీతి దారేనని రెవెన్యూ అధికారులు చాటుతున్నారు. ఏసిబి వాళ్లకు దాడులు మామూలే... మాకు లంచాలు మామూలే అన్నట్లుగా వుంది వారి నిర్వాకం.**

జిల్లాలో ఇటీవల అడపాదడపా అవినీతి నిరోధక శాఖ దాడులు ఎక్కువగానే ఉంటున్నాయి. తాజాగా దుత్తలూరు తహాశీల్దార్ లలిత ఓ రైతు నుండి 15వేలు లంచం తీసుకుంటూ ఏసిబి అధికారులకు రెడ్ హ్యాండెడ్‌గా చిక్కారు. మార్చి 28వ తేదీన ఈ సంఘటన జరిగింది. దుత్తలూరు మండలం తురకపల్లికి చెందిన పోలు శివ రామిరెడ్డి తన తండ్రి, చిన్నాన్నల పేర్లతో వున్న 14.70ఎకరాల భూములకు సంబంధించిన వివరాలను ఆన్‌లైన్‌లో ఎక్కించేందుకు దరఖాస్తు చేసుకున్నాడు. ఈ భూముల వివరాలను ఆన్‌లైన్‌లోకి ఎక్కించేందుకు తహాశీల్దార్ 20వేల రూపాయలు డిమాండ్ చేసింది. చివరకు 15వేలకు బేరం కుదిరింది. లంచం ఇవ్వడం ఇష్టం లేని శివరామిరెడ్డి మార్చి 26వ తేదీన ఏసిబిని ఆశ్రయించి విషయమంతా చెప్పాడు. ఏసిబి అధికారుల సూచనల మేరకు 28వతేదీ ఉదయం కావలి, జనతాపేటలో వుంటున్న తహాశీల్దార్ లలిత ఇంటికి వెళ్ళారు. లలితకు లంచం ఇస్తుండగా అక్కడే మాటువేసి వున్న ఏసిబి అధికారులు ఆమెను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. వెంటనే ఆమె ఇంట్లో సోదాలు నిర్వహించగా 9.50లక్షల నగదుతో పాటు భారీగా ఆస్తుల డాక్యుమెంట్లు దొరికాయి. ఆమె ఇంటిలో సోదాలు చేస్తున్న సమయంలో ఏసిబి డిఎస్పీ తోట ప్రభాకర్ సెల్‌కు దుత్తలూరు మండలంకు చెందిన చేనేత కార్మికులు ఫోన్ చేశారు. భారీ వర్షాల కారణంగా నష్టపోయిన చేనేత కార్మికులకు ప్రభుత్వం విడుదల చేసిన నష్టపరిహారం నిధులు ఇచ్చేందుకు తహాశీల్దార్ ఒక్కో బాధితుడి నుండి 1500 రూపాయలు లంచం డిమాండ్ చేస్తుందని చెప్పారు. దీని గురించి అక్కడే వున్న తహాశీల్దార్‌ను డిఎస్పీ ప్రశ్నించగా... నా ఒక్క దానికే కాదని, క్రింద నుండి పైదాకా అందరికీ వాటాలు ఇవ్వాలని ఆమె ఎలాంటి సంకోచం లేకుండా చెప్పింది. దీనిపై డిఎస్పీ వెంటనే కావలి ఆర్డీఓ లక్ష్మీ నరసింహంతోనూ మాట్లాడి రెవెన్యూ అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

## • దుబాయ్‌లో...

# దువ్వూరోడి పవర్



***తండ్రి పారిశ్రామిక దిగ్గజం కాదు... పెట్టుబడులు పెట్టి కంపెనీలు నెలకొల్పడానికి వారసత్వంగా వచ్చిన ఆస్తులు లేవు. పుట్టింది వాణిజ్య నగరాలలో, సంపన్నుల కుటుంబంలో కాదు. అయితే ఒక మనిషి లక్ష్యాన్ని చేరుకోవాలంటే ఇవేమీ అవసరం లేదని నిరూపించాడు ఓ యువకుడు. ఒక లక్ష్యాన్ని చేరుకోవాలంటే కావాల్సింది మెదడులో మంచి ఆలోచనలు, గుండెలో ఆత్మస్థైర్యం, మనసులో విశాల దృక్పథం అని చాటి, సక్సెస్‌కు కేరాఫ్ అడ్రస్‌గా నిలిచాడా యువకుడు. మన ఆలోచనలను మన జీవితానికే పరిమితం చేసుకుంటే ఒక సాధారణ ఉద్యోగిగానే మిగిలిపోతాను, అదే ఆలోచనలను విస్తృతం చేస్తే పదిమందికీ ఉద్యోగాలను, ఉపాధిని చూపించగలుగుతానని భావించాడు. ఆ దిశగా సంకల్పంతో ముందుకు సాగి ఈరోజు 5వేల మంది దాకా నిరుద్యోగులకు ఉపాధి కల్పించి తానొక వ్యక్తిని కాదు వ్యవస్థను అని నిరూపించుకున్న ఆ యువకుడి పేరే దువ్వూరు కిషోర్ బాబు. ఇంటిపేరుతో పాటు పుట్టిన ఊరిపేరు కూడా దువ్వూరే! నెల్లూరు జిల్లా సంగం మండలంలో వుంది ఈ గ్రామం. బుచ్చిరెడ్డిపాలెం దాటాకా కనిగిరి రిజర్వాయర్ చివరి భాగంలో వస్తుంది.***

ప్రపంచ దేశాలలో నెల్లూరోళ్లు ఎక్కడున్నా ప్రత్యేకమే! ఏ రంగంలో అయినా పైచేయి నెల్లూరోళ్లదే! ఈ నేలలో ప్రవహించే పెన్న నీళ్ల పవర్ అటువంటిది. దువ్వూరు కిషోర్ కూడా ఆ పెన్ననీళ్లు తాగినోడే! కాబట్టే ఈరోజు గల్ఫ్ దేశాలలో పవర్ రంగాన తన పవర్‌ను చూపుతున్నాడు. దుబాయ్, సౌదీ, షార్జా, అబుదాబి, ఖతార్, రియాద్ వంటి దేశాలలో నెలకొల్పిన పవర్ ప్రాజెక్టుల నిర్మాణంలో తన సత్తా చాటాడు. గల్ఫ్‌లోనే వందకుపైగా పవర్ స్టేషన్‌లను నిర్మించి పవర్ ఆఫ్ దుబాయ్‌గా పేరు గడించాడు.

దువ్వూరు కిషోర్ విజయప్రస్థానం చాలామంది ప్రపంచంలోని వివిధ రంగాల విజేతల మాదిరిగానే గ్రామీణ నేపథ్యం నుండి మొదలైంది. మధ్యతరగతి వ్యవసాయ కుటుంబంలో దువ్వూరు రామ్మోహన్‌రావు, లీలావతి దంపతులకు 1967 జూలై 15న ఆయన జన్మించాడు. ఓ పక్క తండ్రికి వ్యవసాయ పనుల్లో చేదోడువాదోడుగా ఉంటూనే దువ్వూరులో పదో తరగతి వరకు చదివాడు. నెల్లూరు విఆర్‌సిలో ఇంటర్‌ను పూర్తి చేసిన అనంతరం అనంతపురంలో ఎలక్ట్రిసిటీ విభాగంలో బిటెక్ చేశాడు. కాకినాడలో హైఓల్టేజ్ విభాగంలో ఎంటెక్‌ను పూర్తి చేశాడు. ఏపిఎస్ఇబిలో ఉద్యోగం వచ్చినా, తాను చదివిన చదువుకు ఇంకా ఏదో సాధించాలనే తపనతో ఆ ఉద్యోగాన్ని వద్దనుకున్నాడు. 1992లో దుబాయ్‌కి వెళ్లి దుబాయ్ ఇంజనీరింగ్ కంపెనీలో కన్సల్టెంట్ ఇంజనీర్‌గా చేరాడు. 1995వరకు ఆ ఉద్యోగంలో పనిచేసినా ఆయనకు ఏదో వెలితి అనిపించేది. 1995లో ఆ ఉద్యోగాన్ని వదిలి ఎమిరేట్స్ ట్రేడింగ్ అథారిటీలో చేరి 2008 వరకు పని చేశాడు. 32ఏళ్ల వయసులోనే ఆ సంస్థకు యంగెస్ట్ జిఎంగా పనిచేసి విశేష అనుభవం గడించాడు. హైఓల్టేజీ అంశంపై ప్రపంచ వ్యాప్తంగా సింగపూర్, జపాన్, హార్వర్డ్ వంటి చోట్ల శిక్షణ పొందాడు.

అయితే ఇంతవరకు అతని గమ్యం సాగింది ఒక కోణంలోనే! ఇంకో చోట పనిచేయడం అతనికి సంతృప్తినివ్వలేదు. తాను బ్రతకడం కాదు, తన బ్రతుకును పదిమందికి ఉపయోగపడేలా మలచుకోవాలనుకున్నాడు. ఈ ఆశయంతోనే 2008లో జజీరా ఎమిరేట్స్ పవర్ కంపెనీని స్థాపించాడు. ఆరోజు ముగ్గురు ఉద్యోగులతో సంస్థను ప్రారంభించాడు. ఈరోజు 5వేల మంది ఉద్యోగులతో ఆ సంస్థ ఉన్నత స్థాయికి చేరింది. ఈ కంపెనీలో 300మంది గ్రాడ్యుయేట్ ఇంజనీర్స్ వుండడం విశేషం. తన సొంత గడ్డ నెల్లూరు జిల్లా మీద మమకారంతో ఈ జిల్లా నుండే 40మందికి ఉద్యోగావకాశాలు కల్పించడం విశేషం. గ్రామీణ నేపథ్యం వున్నవారికి, అప్పుడే పట్టా అందుకున్న ఇంజనీర్లకు ఉద్యోగాలలో ప్రాధాన్యతనిస్తుంటాడు కిషోర్‌బాబు.

అంతర్జాతీయ కంపెనీలైన సీమెన్స్, ఎల్ అండ్ టి, ఏబిపిలతో పోటీపడి జజీరా పవర్ స్టేషన్‌ల నిర్మాణం కాంట్రాక్టులను దక్కించుకుంది. స్థాపించిన ఏడేళ్లలోనే 400కె.వి., 220కె.వి., 132కె.వి. వంటి విద్యుత్ స్టేషన్‌లను వందకు పైగా నెలకొల్పింది. ప్రతిఏటా గ్రాడ్యుయేట్ ఇంజనీర్స్ ట్రైనింగ్ పెట్టి మధ్యలో ఏజంట్ల అవసరం లేకుండా తమ ఉద్యోగులను ఎంపిక చేసుకుంటున్నారు. ప్రతియేటా 25మంది ఇంజనీర్లను తమ కంపెనీలోకి తీసుకుంటుంటారు. ఇటీవల తెలంగాణ హోంమంత్రి నాయిని నరసింహారెడ్డి సైతం దుబాయ్ పర్యటనలో దువ్వూరు కిషోర్‌బాబును కలిసి తమ కంపెనీ ఉద్యోగాలలో తెలంగాణ యువతకు అవకాశం కల్పించాలని కోరడం, ఈమేరకు ఇటీవల నిజామాబాద్‌లో జజీరా ఎమిరేట్స్ పవర్ తరఫున రిక్రూట్‌మెంట్ క్యాంపు నిర్వహించడం జరిగింది. ఏపికి చెందిన 'ఓయ్‌క్యాప్', తెలంగాణకు చెందిన 'టామ్‌టామ్' సంస్థల ద్వారా జజీరా ఎమిరేట్స్ పవర్‌లో ఉద్యోగాల నియామకం జరుగుతుంది.

(మిగతా 11వ పేజీలో)



హైదరాబాద్‌లో ఏపి శాసనసభలోని సిఎం ఛాంబర్‌లో బర్త్‌డే కేక్ కట్ చేసి సోమిరెడ్డికి తినిపిస్తున్న సిఎం చంద్రబాబు

### అభిమానుల ఆనందోత్సాహాల మధ్య...

# సోమిరెడ్డి జన్మదిన వేడుకలు



సోమిరెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న వివేకా

తెలుగుదేశంపార్టీ జాతీయ పొలిట్ బ్యూరో సభ్యులు, ఎమ్మెల్సీ సోమిరెడ్డి చంద్ర మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలు హైదరాబాదులోనూ, నెల్లూరులోనూ మార్చి 26వ తేదీ ఘనంగా జరిగాయి. నెల్లూరుజిల్లా పార్టీ కార్యాలయంలో టిడిపి రాష్ట్ర మాజీ ప్రధానకార్యదర్శి తాళ్ళపాక అనూరాధ ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో కేక్ కట్ చేసి పంచిపెట్టారు. టిడిపి నగర ఇన్‌ఛార్జ్ ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి, తెలుగు మహిళా జిల్లా అధ్యక్షురాలు పొత్తూరు శైలజ, టిడిపి నేతలు మండవ రామయ్య, వై.వి.సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

సోమిరెడ్డి కార్యాలయంలో టిడిపి నేత ఒట్టూరు సంపత్‌రాజు, నారా లోకేష్ సేవాసమితి వ్యవస్థాపకుడు కంచి మల్లిఖార్జునరెడ్డి కేక్ కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. సోమిరెడ్డి నివాసంలో టిఎన్ఎస్ఎఫ్ అధ్యక్షుడు కాకర్ల తిరుమలనాయుడు ఆధ్వర్యంలో సోమిరెడ్డికి గజమాల వేసి, కేక్ కట్ చేసి శాలువ, పుష్పమాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నేతలు రమేష్‌రెడ్డి, ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి, కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, తాళ్ళపాక అనూరాధ, కిలారి వెంకటస్వామినాయుడు, మహిళా కార్పొరేటర్లు పాల్గొన్నారు.

### తూర్పు వైపున.. తియ్యతియ్యని..

# మురళీకృష్ణ మిఠాయిలు

## • స్టోన్‌హౌస్‌పేటలో శ్రీ సాయి కేఫ్
## • ప్రారంభించిన ప్రముఖులు





46సంవత్సరాల సుదీర్ఘ అనుభవంతో 47వ వడిలో అడుగిడిన మురళీకృష్ణ 70 సంస్థ ఇప్పుడు తమ మిఠాయిలతో తూర్పు వైపు నెల్లూరీయుల నోళ్ళు తీపిచేస్తోంది. సంస్థ ప్రారంభించి నాలుగున్నర దశాబ్దాలు దాటినప్పటికీ ఇప్పటి వరకూ పూర్తి స్థాయి శాఖను ఎక్కడా ప్రారంభించని మురళీకృష్ణ యాజమాన్యం తొలిసారిగా ఈ బ్రాంచీని ఏర్పాటు చేసింది.

సత్యసాయి సేవకుడు, నెల్లూరీయులకు చిరపరిచితుడైన ఉత్సాహవంతుడు గాదంశెట్టి సుధాకర్ సారధ్యంలో ఆయన కుమారుడు సాయిచైతన్య, చైతన్య మిత్రుడు నూతలపాటి షరణేష్‌లు మురళీకృష్ణ స్వీట్స్ & ఐస్‌క్రీమ్స్‌ను ఫ్రాంచైజీ తీసుకుని స్టోన్‌హౌస్‌పేట మెయిన్‌రోడ్డు మొదట్లోనే తాము నూతనంగా ప్రారంభించిన శ్రీ సాయి కేఫ్‌లో ఏర్పాటు చేశారు. నేటి కాలానికి అనుగుణంగా ఆధునిక సౌకర్యాలతో అలంకరించుకున్న శ్రీ సాయి ఎయిర్‌కండీషన్డ్ కేఫ్‌ని ప్రముఖదాత, మంచి మనసుకు మారుపేరు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, మురళీకృష్ణ వ్యవస్థాపకులు, అన్న దాత గ్రోసు గోపాలయ్యలు తమ సువర్ణ హస్తాలతో ప్రారంభించారు.

మార్చి 24వ తేదీ గురువారం 9గంటల 9 నిముషాల 9సెంకడ్లకు జరిగిన ఈ ప్రారంభోత్సవ వేడుకలో గాదంశెట్టి, నూతలపాటి కుటుంబసభ్యులతో పాటు వారి ఆప్తులు, ఆత్మీయులు అధిక సంఖ్యలో పాల్గొని చైతన్య, షరణేష్‌లను దీవించారు. స్వీట్స్ మరియు ఐస్‌క్రీమ్స్‌తో పాటు ఫ్రూట్‌జ్యూస్, కాఫీ టీలను కూడా ఇక్కడ అందిస్తున్నారు.

మాజీశాసనసభ్యుడు ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి, నంబూరు లేబొరేటరీస్ ఛైర్మెన్ నంబూరు మోహన్‌రావు, మాదరన్ స్కూల్ సారధి వాకాటి విజయకుమార్‌రెడ్డి, 'లాయర్' సంగ్రాహకుడు తుంగా శివప్రభాత్‌రెడ్డి, మురళీకృష్ణ హోటల్ అభివృద్ధి సాధకులు వీరిశెట్టి హజరత్‌బాబు, గ్రోసు సుబ్బారావు, గ్రోసు మురళీకృష్ణ, గ్రోసు చైతన్యలతో పాటు రెండవ నగర సర్కిల్ ఇన్స్‌పెక్టర్ సుధాకర్‌రెడ్డి, అమ్మ ఫర్నిచర్ మాల్ సారధులు సుధాకర్‌రెడ్డి, సుమన్, సుజన్, నలుబోలు బలరామయ్యనాయుడు తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేశారు. ఆల్‌ది బెస్ట్ టు చైతన్య & షరణేష్.










# 'శ్రీ అల్లూరు పోలేరమ్మ వైభవమ్'

## • భక్తిగీతాల సి.డి ఆవిష్కరణ

అల్లూరులో వెలసివున్న శ్రీ పోలేరమ్మతల్లి వైభవాన్ని కీర్తిస్తూ అల్లూరు కవులు రచించిన భక్తిగీతాల సి.డిని మార్చి 24న ఆవిష్కరించారు. భక్తుల పాలిట కల్పవల్లిగా ప్రసిద్ధి చెం దిన అల్లూరు పోలేరమ్మతల్లికి నూతన ఆలయ నిర్మాణం, విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్స వాలను పురస్కరించుకుని ఈ సి.డిని వెలువరించారు. అల్లూరులోని పోలేరమ్మ ఆలయం వద్ద ఎంతో వైభవంగా జరిగిన సంబరంలో రిటైర్డ్ లా కమిషన్ ఛైర్మెన్ పొనకా వెంకట్రామిరెడ్డి చేతులమీదుగా సి.డిని ఆవిష్కరించారు. అల్లూరు మాజీ ఎమ్మెల్యే కాటంరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో అల్లూరు పోలేరమ్మ దేవస్థానం కమిటీ ఛైర్మెన్, రామకృష్ణ విద్యాసంస్థల కరెస్పాండెంట్ అల్లంపాటి విజయవర్ధన్‌రెడ్డి, దొడ్ల సుబ్బారెడ్డి, కాటంరెడ్డి కోదండరామిరెడ్డి, ఆలయ ఇ.ఓ రవీంద్రరెడ్డి తదితర ప్రముఖులు పాల్గొన్నారు. అల్లూరు కవులు అవధాని కోట రాజశేఖర్, వంజవాక సతీష్‌రెడ్డి, మద్దూరు శ్రీనివాసులు ('లాయర్' వారపత్రిక సబ్ ఎడిటర్) ఈ గీతాలను రచించారు. ఈ గీతాలకు ప్రముఖ సినీసంగీత దర్శకుడు కనిష్క మంచి సంగీతాన్ని అందించారని ఈ సందర్భంగా విష్ణువర్ధన్‌రెడ్డి అభినందించారు. బడబాగ్ని ఆంజనేయరాజు పర్యవేక్షణలో ఈ సి.డిని రూపొందించగా, ఆవిష్కరణ కార్యక్రమానికి అనంత రాజు బాలకృష్ణమరాజు వ్యాఖ్యాతగా వ్యవహరించారు. సినీ సంగీత దర్శకుడు కనిష్క, సినీదర్శకుడు కెవి రమణ, పాత్రికేయుడు శ్రీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# రైతుకు మద్దతు ధర కల్పించండి

## వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ జానకి



రైతులకు అవసరమైన ప్రాంతాల్లో ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని, మద్దతుధర కల్పించేలా చర్యలు చేపట్టాలని నెల్లూరుజిల్లా కలెక్టర్ యం.జానకి ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ నుంచి వివిధ మండలాల అధికారులు, రెవెన్యూ, పోలీసు అధికారులతో కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాలలో రైతులకు అవసరమైన సౌకర్యాలు కల్పించాలన్నారు. నిబంధనలు అతిక్రమించి ఇసుక అక్రమరవాణా చేసేవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. జాయింట్ కలెక్టర్ ఇంతియాజ్ మాట్లాడుతూ ప్రతినిత్యం కొనుగోలు చేసిన ధాన్యం వివరాలు ఆన్‌లైన్లో పొందుపరచాలన్నారు. తేమ శాతం, దుమ్ము ధూళి తక్కువగా ఉండేలా రైతులకు అవగాహన కల్పించాలన్నారు. ధాన్యం విక్రయించిన రైతుకు సకాలంలో నగదు బ్యాంకు అకౌంట్‌లో జమ చేసేలా చూడాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ఎస్పీ విశాల్ గున్నీ, డిఆర్‌డిఏ పిడి చంద్రమౌళి, డిఎస్వో టి.ధర్మారెడ్డి, డిఎం కొండయ్య, మైనింగ్ ఏ.డి రాజశేఖర్ పాల్గొన్నారు.



మార్చి 31వ తేదీ ఎస్సీ ఎస్టీ బిసి మైనార్టీ సామాజిక న్యాయ సాధికారత యాత్రలో భాగంగా నెల్లూరుకు విచ్చేసిన రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు పద్మశ్రీకి స్వాగతం పలుకుతున్న జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు శ్రీమతి పందిళ్ళపల్లి అరుణమ్మ



# 'ప్రభా'తం

పరిపాలకుడిని బట్టి, పరిపాలనా తీరునుబట్టి రాష్ట్రమైనా, దేశమైనా దాని అభివృద్ధి ఆధారపడి ఉంటుంది. అభివృద్ధికి ఎంచుకునే మార్గాలలో వైవిధ్యమే ఆయా రాష్ట్రాల లేదా దేశాల భవిష్యత్‌ను మారుస్తుంది. ఈ కోణంలో రెండు తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు అభివృద్ధి పరంగా ఏఏ దారులను ఎంచుకున్నారన్నది ప్రధాన ప్రశ్న?

ముఖ్యమంత్రిగా పరిపాలనలోగాని, రాజకీయ అనుభవంలో గాని చంద్రబాబు కంటే కేసీఆర్ జూనియర్. ప్రపంచంలోని పలు దేశాలకు తెలిసిన నాయకుడు చంద్రబాబునాయుడు. 1995-2004ల మధ్య ఏపి సీఎంగా పని చేసిన కాలంలో ఆర్థిక సంస్కరణల వేగవంతం, సాంకేతిక ప్రగతి ద్వారా ప్రపంచ దేశాల దృష్టిని ఆకర్షించిన నాయకుడు. బిల్ క్లింటన్, బిల్‌గేట్స్ వంటి వారి మెప్పును కూడా పొందాడు. ఒక రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా కంటే సిఇఓగానే ఎక్కువగా పని చేశాడు. 2014 ఎన్నికల్లో చంద్రబాబు అధికారంలోకి రావడానికి ప్రధాన కారణం అనుభవజ్ఞుడైన చంద్రబాబు సీఎం అయితేనే విభజన వల్ల అన్యాయానికి గురైన ఆంధ్రప్రదేశ్ బాగు పడగలదని ప్రజలు నమ్మడం, ఈ విషయంలో గతంలో చంద్రబాబును వ్యతిరేకించిన ఉద్యోగ వర్గాలు సైతం ఆ ఎన్నికల్లో చంద్రబాబుకే జై కొట్టాయి.

## ఇద్దరి మధ్య ఎంత తేడా?





**విభజన మూలంగా ఆర్థిక లోటుకు గురైన ఆంధ్రప్రదేశ్ చంద్రబాబు పాలనలో శరవేగంగా అభివృద్ధి చెంది, ఆ లోటును అధిగమిస్తుందని, విభజనతో ఆర్థికంగా శక్తివంతంగా తయారైన తెలంగాణ రాష్ట్రం మాత్రం కేసీఆర్ విధానాలతో త్వరలోనే దివాళా తీస్తుందని, ఆ రాష్ట్ర ప్రజలు ఆంధ్రప్రదేశ్ నుండి ఎందుకు విడిపోయామా... అని బాధపడే రోజులు వస్తాయని చాలా మంది భావించారు. అయితే, తమ మీద ఉంచిన అంచనాలకు విరుద్ధంగా ఇద్దరు ముఖ్య మంత్రుల పరిపాలనా విధానాలున్నాయి.**

చంద్రబాబు పాలనలో విభజన మూలంగా ఆర్థిక లోటుకు గురైన ఆంధ్రప్రదేశ్ శరవేగంగా అభివృద్ధి చెంది, ఆ లోటును అధిగమిస్తుందని, విభజనతో ఆర్థికంగా శక్తివంతంగా తయారైన తెలంగాణ రాష్ట్రం మాత్రం కేసీఆర్ విధానాలతో త్వరలోనే దివాళా తీస్తుందని, ఆ రాష్ట్ర ప్రజలు ఆంధ్రప్రదేశ్ నుండి ఎందుకు విడిపోయామా... అని బాధపడే రోజులు వస్తాయని చాలామంది భావించారు. అనుకున్నదొకటైతే ఇక్కడ జరుగుతున్నది ఇంకొకటి. తమ మీద ఉంచిన అంచనాలకు విరుద్ధంగా ఇద్దరు ముఖ్యమంత్రుల పరిపాలనా విధానాలున్నాయి.

తెలంగాణ సీఎంగా కేసీఆర్ అభివృద్ధినే ప్రధాన అజెండాగా ఎంచుకున్నారు. రాజకీయాలకు తక్కువ ప్రాధాన్యతనిస్తున్నట్లు షో చేస్తూనే, రాజకీయంగా సైతం ఎక్కువ ప్రయోజనం పొందుతున్నాడు. గ్రేటర్ ఎన్నికల్లో గాని, వివిధ కార్పొరేషన్ ఎన్నికల్లో టీఆర్ఎస్ విజయాలే ఇందుకు ఉదాహరణ. ఇక తెలుగుదేశం, కాంగ్రెస్‌ల నుండి భారీ సంఖ్యలోనే టీఆర్ఎస్‌లోకి వలసలు సాగాయి. అయితే ఎక్కడా ప్రలోభాలు తెరమీదకు రాలేదు. అసెంబ్లీ సమావేశాలు సైతం హుందాగా నడుపుతున్నారు. కేసీఆర్ స్వయంగా సమస్యలకు వివరణ ఇస్తున్నాడు. ప్రతిపక్ష సభ్యులకు ప్రాధాన్యతనిస్తున్నాడు. తెలంగాణ ఉద్యమ సమయంలో చూసిన కేసీఆర్‌కు ఇప్పుడు ఆ రాష్ట్ర సీఎంగా చూస్తున్న కేసీఆర్‌కు చాలా తేడా కనిపిస్తోంది. అప్పుడు ఆంధ్రోళ్లను దొంగలు, బందిపోట్లు అన్న కేసీఆర్ ఇప్పుడు వారిని ఆలింగనం చేసుకుంటున్నాడు. తెలంగాణ ఖజానా నుండి డబ్బులు ఇవ్వాల్సి వుండే ఆంధ్రా ఉద్యోగులను మాత్రం అక్కడ నుండి వెళ్లగొట్టారు. హైదరాబాద్ అభివృద్ధికి ఉపయోగపడే ఆంధ్రా పారిశ్రామికవేత్తలు, వ్యాపారవేత్తలు, ఆంధ్ర సినిమా వాళ్ల జోలికి మాత్రం ఆయన పోలేదు. వాళ్లను వెళ్లగొడితే హైదరాబాద్‌కు ఏ గతి పడుతుందో ఆయనకు తెలుసు. అందుకే తెలివిగా వ్యవహరించాడు. తెలంగాణ అభివృద్ధి కోసం అక్కడ ప్రతి మంత్రి కూడా తనవంతు కృషి చేస్తున్నాడు. తెలంగాణలో ఐటి, పారిశ్రామికాభివృద్ధికి కేటీఆర్ చూపిస్తున్న చొరవ ప్రశంసలందుకుంటోంది. తెలంగాణ యువకులకు ఉద్యోగాల కల్పనకు అక్కడి మంత్రులు విదేశాలలో సైతం పర్యటనలు జరిపి పెట్టుబడిదారులను ఆహ్వానిస్తున్నారు. జల వివాదాలను పరిష్కరించుకోవడానికి కేసీఆర్ మహారాష్ట్ర సీఎంతో చర్చలు జరపడం చూశాం. తన తెలంగాణకు ఏం కావాలో అది సాధించుకోవడానికి కేసీఆర్ ఎక్కడా వెనక్కి తగ్గడం లేదు. విభజనతో అన్యాయమైపోయింది ఆంధ్రప్రదేశ్ అయినా ఈ రాష్ట్రంతో పోటీ పెట్టుకుంటూ కేంద్రం నుండి నిధులు రాబట్టుకోవాలనుకుంటున్నాడు.

తెలంగాణలో అలావుంటే ఆంధ్రప్రదేశ్‌లో అందుకు భిన్నంగా వుంది. ఇక్కడ రాజకీయాలు తప్పితే అభివృద్ధి కనిపించడం లేదు. రాష్ట్రంలో ప్రతిపక్షాన్ని నిర్వీర్యం చేయాలి, ప్రతిపక్ష ఎమ్మెల్యేలందరినీ తమ పార్టీలో చేర్చుకోవాలన్నదే ఇక్కడ అధికారపార్టీ అజెండాగా వుంది. ఇది ఎవరికీ ఉపయోగం లేని చర్య. పనికిమాలిన పని. ఇక అసెంబ్లీలో ప్రజా సమస్యలు ఏ విధంగా పక్కదారి పడుతున్నాయో చూస్తూనే వున్నాము. ప్రజా సమస్యల గురించి ప్రస్తావించడం, చర్చించడం, వివరించడం అన్నవి సభలో కనిపించడం లేదు. ఇంతటి వరెస్ట్ సమావేశాలు ఇంకే రాష్ట్ర అసెంబ్లీలోనూ జరగలేదేమో! అభివృద్ధి ప్రక్రియను చూస్తే ఏ మాత్రం ఆశాజనకంగా లేదు. సింగపూర్ వాళ్లు గీసిచ్చిన మాస్టర్ ప్లాన్ ప్రకారం అమరావతి రాజధానిని నిర్మిస్తే అంతకంటే అదృష్టం లేదు అన్నట్లుగా పాలకుల తీరుంది. అభివృద్ధిని ఒకేచోట కేంద్రీకరించవద్దన్న మేధావుల మాటను ఈ ప్రభుత్వం చెవికెక్కించుకోవడం లేదు. మొన్నటి దాకా అందరూ కలిసి హైదరాబాద్‌కు దోచిపెట్టారు. అభివృద్ధినంతా అక్కడే గుట్టగా పోగేశారు. విభజన సమయంలో హైదరాబాద్‌ను కోల్పోతున్నామని ఏడ్చారు. ఇప్పుడు అమరావతి విషయంలోనూ అదే తప్పు చేస్తున్నారు. ఈ ప్రభుత్వం అమరావతి రాజధాని మీద 80శాతం శ్రద్ధను చూపిస్తూ మిగిలిన 20శాతం శ్రద్ధను మాత్రమే ఇతర అంశాల మీద పెడుతుంది. రాష్ట్రంలోని 13జిల్లాలలో అభివృద్ధిని వికేంద్రీకరించాలన్న ఆలోచనే చేయడం లేదు.

ఏకకాలంగా విడిపోయిన రెండు రాష్ట్రాల్లో పరిపాలన సాగుతున్న తీరిది. ఒకరు పునాదిని బలంగా నిర్మించుకునే ప్రయత్నం చేస్తుంటే, ఏపి పాలకులు మాత్రం రాష్ట్రానికి పైపై మెరుగులు దిద్దుతూ లోపల చెదను అలాగే ఉంచేస్తున్నారు.

## ప్రజావాకర్స్ నూతన కార్యవర్గం

నెల్లూరుజిల్లా ప్రజావాకర్స్ సంఘం నూతన కార్యవర్గాన్ని గత నెల 24వ తేది అధ్యక్షులు చలంచర్ల భాస్కర్‌రెడ్డి, గౌరవ సలహాదారు బిరుదవోలు రామిరెడ్డి ఆధ్వర్యంలో నిర్ణయించారు. ప్రధాన కార్యదర్శిగా జెయస్ఆర్ ఆంజనేయులు, ఉపాధ్యక్షులుగా టివి రమణయ్య, సిఎల్ ప్రసాద్, అసోసియేట్ అధ్యక్షులుగా మెట్టు సుధాకర్‌రెడ్డి, సంయుక్త కార్యదర్శులుగా యం.సత్యనారాయణ, యం.చెంచయ్య, ఎ.నరశింహారావు, కో-ఆర్డినేటర్‌గా బి.ఆర్.శ్రీధర్, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా వి.రాజగోపాల్, ప్రచారకార్యదర్శిగా కె.శ్రీనివాసులు, కోశాధికారిగా ఓంకారం సుబ్బరాయుడు, గౌరవసలహాదారులుగా యం.శ్రీనివాసరావు, యం.వి.కృష్ణయ్య, డా॥ జయకుమార్, డా॥ దినకర్, ఎస్.కె.ఖాశిం, పి.సింధు, మరో 13మందిని కార్యవర్గసభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

## వ్యర్థాలతో ఎరువుల తయారీ యంత్రం

ఇళ్ళలోని వ్యర్థాలతో ఎరువు తయారీ చేసే యంత్రాన్ని ఆదివారం నెల్లూరు ఆదిత్య నగర్‌లో ప్రదర్శించారు. పారిశుద్ధ్యంపై తీసుకోవాల్సిన చర్యలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఇందులో స్మార్ట్ జీరో వేస్ట్ అనే పేరు గల యంత్రాన్ని సమావేశంలో ఉంచారు. అనంతరం యంత్రం పనితీరు గురించి సంస్థ సభ్యులు వివరించారు. ఈ సమావేశంలో నగర కమిషనర్ వెంకటేశ్వర్లు, ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

## ఆయుష్షును పెంచేదే ఆయుర్వేదం

మనిషి ఆరోగ్యం, ఆయుష్షను పెంచేందుకు ఆయుర్వేదం ఎంతగానో ఉపయోగపడుతుందని నెల్లూరుజిల్లా అదనపు జాయింట్ కలెక్టర్ రాజ్‌కుమార్ అన్నారు. నెల్లూరు ఫత్తేఖాన్‌పేట రైతుబజార్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన శ్రీ పతంజలి ఆయుర్వేద కేంద్రం, జూట్‌బ్యాగుల దుకాణాలను ఏజేసి రాజ్‌కుమార్ ఆదివారం ప్రారంభించి మాట్లాడుతూ మనపూర్వీకులు అందించిన గొప్పవరం ఆయుర్వేదమన్నారు. మానవుడికి, ప్రకృతికి అవినాభావ సంబంధం ఉందన్నారు. మార్కెటింగ్ ఏడి ఉపేంద్రకుమార్ మాట్లాడుతూ ఫత్తేఖాన్‌పేట రైతుబజార్‌ను ప్రత్యేకత కలిగినదిగా తయారు చేసేందుకు కృషి చేస్తున్నామని, ఈ దుకాణాలతో పాటు త్వరలో సేంద్రీయ ఉత్పత్తులు, కాల్షియం కార్బైడ్ రహిత పండ్ల దుకాణాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్టేట్ అధికారి పద్మనాభరావు, ఉద్యానశాఖాధికారి మురళీ పాల్గొన్నారు.

## బాబ్జీరావుకు రీజినల్ డిప్యూటి డైరెక్టర్‌గా పదోన్నతి

నెల్లూరు చేనేత, జౌళిశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ నెల్లి బాబ్జీరావుకు ఒంగోలు రీజినల్ డిప్యూటి డైరెక్టర్‌గా పదోన్నతి కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. కర్నూలు ఏడి సత్యనారాయణకు నెల్లూరు ఇన్‌ఛార్జి ఏడిగా బాధ్యతలప్పగించింది.

## ప్రచారమాధ్యమాల గొంతు నొక్కడం తగదు



ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా నిలుస్తూ ప్రజాస్వామ్య వ్యవస్థలో కీలక భూమిక పోషించే ప్రచార మాధ్యమాల గొంతునొక్కడం ప్రభుత్వానికి తగదని ఏపియుడబ్ల్యూజే రాష్ట్ర కార్యదర్శి ఏ.జయప్రకాష్ పేర్కొన్నారు. మీడియాపై ప్రభుత్వయంత్రాంగం అనుసరిస్తున్న తీరుపై ఏపియూడబ్ల్యూజే ఆధ్వర్యంలో సోమవారం జర్నలిస్టులు నిరసన తెలిపారు. ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు, జర్నలిస్టులు నెల్లూరు ప్రెస్‌క్లబ్ నుంచి ర్యాలీగా కలెక్టరేట్ చేరుకుని ధర్నా నిర్వహించారు. అనంతరం జాయింట్ కలెక్టర్ ఇంతియాజ్ అహ్మద్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏపియుడబ్ల్యూజె జిల్లా అడ్‌హక్ కమిటి కన్వీనర్ ఎం.చంద్రశేఖర్, జర్నలిస్ట్ హౌసింగ్ సొసైటి అధ్యక్షుడు జయరాజ్, జర్నలిస్టులు పాల్గొన్నారు.




## జంపింగ్ జిలానీలకు బుద్ధి చెప్పాలి

అధికారం కోసం సీటిచ్చి గెలిపించిన పార్టీ కడుపులో తన్ని ఇంకో పార్టీలో చేరుతున్న ఎమ్మెల్యేలకు ప్రజలే బుద్ధి చెప్పాలి. ఒక పార్టీలో గెలిచిన ఎమ్మెల్యే ఇంకో పార్టీలో చేరాలంటే అంతకుముందున్న పదవికి రాజీనామా చేయాలనే నిబంధన పెట్టాలి. లేదా ఒకసారి పార్టీ మార్చారంటే ఇక వారిని ఎన్నికల్లో పోటీ చేయడానికి అనర్హులుగా ప్రకటించాలి.

**పి.నారాయణరెడ్డి, పొద్దుటూరు.**

## పన్ను రాయితీ కావాలి

నెల్లూరు నగరపాలక సంస్థ సిబ్బంది ఈ మధ్య పన్నుల వసూళ్ళ పేరుతో ప్రజలను బాగానే వేధిస్తున్నారు. షాపుల ముందు నిరసనలు వ్యక్తం చేయడం, బాకీదారులను దబాయించడం చేస్తున్నారు. ప్రజల ఆర్థిక పరిస్థితులు ఏమాత్రం బాగాలేవు. చాలామంది కట్టలేని పరిస్థితుల్లో వున్నారు. వడ్డీ మినహాయింపునిస్తే పన్నులు కట్టడానికి సులభంగా ఉంటుంది. **– వై.వి.నాగభూషణం, నెల్లూరు.**

## అతనికంత సీన్ ఎందుకు?

కుహనా లౌకికవాదులు ఉగ్రవాది అఫ్జల్‌గురు ఫోటో పట్టుకుని ఊరేగిన కన్నయ్యకుమార్‌కు పెద్ద సీన్ ఇస్తున్నారు. అతనినొక హీరోని చేసి మాట్లాడుతున్నారు. దేశంలో చిచ్చుపెట్టిన ఉగ్రవాదులకు మద్దతు పలికే కన్నయ్యలాంటి నీచులు హీరోలైతే, మరి నిరంతరం ఉగ్రవాదులతో పోరాడుతున్న వీరజవానుల మాటేమిటి? వాళ్లు ఈ దేశ శత్రువులా? కన్నయ్య లాంటి వాళ్లకు అంత సీన్ ఇవ్వనవసరం లేదు. దేశ ద్రోహులను దేశద్రోహులుగానే చూడండి. **– సి.రాజీవి, నెల్లూరు.**

## కోహ్లీకి అభినందనలు

భారత క్రికెట్ జట్టుకు విరాట్ కోహ్లీ ఆణిముత్యమే! చాలా చక్కగా రాణిస్తున్నాడు. జట్టు ప్రతి విజయంలోనూ కీలకపాత్ర అతనిదే! అతని ఆట వ్యక్తిగత రికార్డుల కోసం కాకుండా గెలుపు కోసమే అన్నట్లుగా వుంటుంది. ముఖ్యంగా టీ-20 వరల్డ్‌కప్‌లో సెమీస్‌కు చేరాలంటే ఖచ్చితంగా నెగ్గితీరాల్సిన ఆస్ట్రేలియాపై అతని ఆట అద్భుతం.

**కె.రాంసాగార్, కావలి.**

## సెలవులొచ్చాయి...

# తల్లిదండ్రులు జాగ్రత్త




వేసవి సెలవులొస్తే సంబరమే కాదు, వాటి వెనుక విషాదాలు కూడా ఉంటుంటాయి. ముఖ్యంగా పిల్లల విషయంలో పెద్దలు చాలా జాగ్రత్తగా ఉండాల్సిన సమయమిది. ప్రతి ఏటా చూస్తూనే వున్నా, ప్రతి వేసవి సెలవుల్లో ఒక్క నెల్లూరుజిల్లాలోనే పదుల సంఖ్యలో పిల్లలు మరణించడం. ఆడి పాడుకునే వయసులో వారికి ఏది అపాయమో, ఎక్కడ ఎలా ఆడుకోవాలో తెలియదు. చెరువుకు వెళ్తే, దాన్లో వున్న నీళ్లే కనిపిస్తాయిగాని దాని లోతు తెలియదు. సరదాగా ఈత కొట్టాలని చెరువుల్లోకి, కుంతల్లోకి దిగి ప్రాణాలు పోగొట్టుకుంటున్న అభాగ్యులెందరో!

వేసవి సెలవుల విషాదాలు జిల్లాలో అప్పుడే మొదలయ్యాయి. గత నెల 25వ తేదీ నెల్లూరులో రంగనాథస్వామి రథోత్సవాన్ని చూసాక పెన్నానదిలో ఈతకని దిగిన ముగ్గురు బాలురు ప్రాణాలు కోల్పోయారు. కోవూరులోని జెబిఆర్ స్కూలులో 9వ తరగతి చదువుతున్న లతీఫ్, ఫయాజుద్దీన్, వర్షిత్‌లు పెన్నాలో ఈతకు వెళ్ళి విగత జీవులయ్యారు. ఇంట్లో క్రికెట్ ఆడుకుంటున్నామని చెప్పి వాళ్లు బయటకొచ్చారు. ఇలా తల్లిదండ్రులకు తీరని దుఃఖాన్ని మిగిల్చారు. వేసవి సెలవులలో పిల్లలకు స్పెషల్ సమ్మర్ కోచింగ్‌లు నడుస్తుంటాయి. స్విమ్మింగ్, డ్యాన్స్, కరాటే, మ్యూజిక్, ఫైన్‌ఆర్ట్స్... ఇలా రకరకాలుగా శిక్షణ తీసుకుంటుంటారు. ఇక్కడ వచ్చిన సమస్యేమీ లేదు. కాని అసలు సమస్య గ్రామప్రాంతాల్లోనే! అక్కడ సమ్మర్ క్యాంప్‌లు నిర్వహించే సంస్థలేవీ వుండవు. కాబట్టి గ్రామ ప్రాంతాల్లో పిల్లలు చెరువులు, బావుల్లో ఈత కొట్టడానికి వెళుతుంటారు. పిల్లలే ఒక జట్టుగా ఏర్పడి పెద్దల తోడు లేకుండా చెరువుల్లో దిగి ప్రాణాలు కోల్పోతుంటారు. చెరువుల్లో గ్రావెల్ తవ్వకాలతో పెద్దపెద్ద గోతులు ఏర్పడి ఉంటాయి. వీటి లోతు తెలియక పిల్లలు దిగుతుంటారు. అలాగే మామిడి, చింత చెట్లు ఎక్కి క్రిందపడి గాయాలపాలవుతుంటారు. కాబట్టి పిల్లలను వీలైనంత వరకు ఇళ్ళ దగ్గర ఉంచుకుని ఇన్‌డోర్ గేమ్స్ వంటివి ఆడించుకోవాలి. డ్యాన్స్, మ్యూజిక్ వంటి వాటిపై శిక్షణనిప్పించవచ్చు. గ్రామ పెద్దలు ఒక కమిటీగా ఏర్పడి పిల్లల కోసం వినోదాత్మక కార్యక్రమాలను ఏర్పాటు చేయొచ్చు. ముఖ్యంగా తమ పిల్లలు ఎక్కడకు పోతున్నారనేదానిపై పెద్దలు ఎప్పుడూ ఓ కన్నేసి ఉండాలి.

# హ్యాట్సాఫ్... పోలీస్ వాట్సాప్

- నేరాల నియంత్రణకు సాంకేతిక మార్గం
- ప్రజల సహకారం కీలకం



**9390777727**

***అభివృద్ధి చెందుతున్న సాంకేతిక పరిజ్ఞానం ఈరోజు మంచికంటే చెడుకు ఎక్కువుగా ఉపయోగపడుతోంది. పోలీసుల చేతిలో తుపాకీ ఉంటే హంతకులను చంపొచ్చు, అదే హంతకుల చేతుల్లో తుపాకీ ఉంటే ఏ పాపం తెలియని అమాయకులను చంపుతారు. ఏదైనా మంచి లేదా చెడ్డ వారి చేతుల్లో ఉంటే తేడా ఇదే!***

సాంకేతిక పరిజ్ఞానాన్ని అరాచకశక్తులు నేరాలకు ఉపయోగించుకుంటుంటే పోలీసులు మాత్రం దానిని నేర నియంత్రణకు ఉప యోగిస్తున్నారు. జిల్లా ఎస్పీగా వచ్చిన విశాల్ గున్నీ జిల్లాలో శాంతి భద్రతల పరిరక్షణకు, నేరాల నియంత్రణకు పలు విధానాలు అవలంభిస్తున్నారు. ఇందులో భాగంగా ప్రజల సహకారంతో నేరాలను నియంత్రించే దిశగా దృష్టి పెట్టారు. ఇందులో భాగంగా 'పోలీస్ ఐ' పేరుతో ప్రత్యేక వాట్సప్ నెంబర్ '9390777727' నెంబర్‌ను ప్రజలకు అందుబాటులోకి తెచ్చారు. నేరం జరిగే ప్రతి చోటా పోలీసులు ఉండరు. అయినా నేరం జరుగుతున్న విషయాన్ని వారికి చేరవేస్తే మాత్రం అక్కడకు రావడానికి నేరాలను అరికట్టడానికి అవకాశముంటుంది. జిల్లా పోలీసు కార్యాలయంలో మార్చి 28వ తేదీన 'పోలీస్ ఐ' కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. జిల్లాలో ఏ మారుమూల అసాంఘిక కార్యక్రమాలు జరుగుతున్నా, నేరాలు జరిగినా, చట్ట విరుద్ధ కార్యక్రమాలు జరిగినా, ట్రాఫిక్ సమస్యలున్నా, లేదా పోలీసులతోనే సమస్య వున్నా ఈ వాట్సప్ నెంబర్‌కు ఫోటోలు గాని, వాయిస్ మెసేజ్ గాని వీడియోలు, ఎస్ఎంఎస్‌లు గాని పంపి పోలీసులకు సమాచారం అందించవచ్చు. ఈ మెసేజ్‌లు అందిన వెంటనే పోలీసులు స్పందిస్తారు. 'పోలీస్ ఐ' కోసం ప్రత్యేకంగా ఒక ఎస్ఐని కూడా నియమించారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని నేరాల నియంత్రణకు సహకరించాలి. సమాచారమిచ్చిన వారి వివరాలు గోప్యంగానే ఉంటాయని ఈ సందర్భంగా ఎస్పీ విశాల్ గున్నీ పేర్కొన్నారు.

అధునాతన గృహోపకరణాలకు చిరునామా
అమ్మ ఫర్నిచర్ మాల్
మినీబైపాస్‌రోడ్, నెల్లూరు.
Latest & New Models
ప్రతి కొనుగోలు పై డిస్కౌంట్ కలదు






పుణ్య సంస్మరణ

మాన్యుడు, మరపురాని నేత

శ్రీ సోమిరెడ్డి రాజగోపాలరెడ్డి గారు

కీర్తిశేషులై ఏప్రిల్ 6వ తేదీకి 33 సంవత్సరాలు నిండుతాయి.

ఈ సందర్భంగా ఆ పుణ్యమూర్తిని స్మరిస్తూ...

వారి పవిత్రాత్మకు భక్త్యంజలి ఘటిస్తున్నాము.

కుమారుడు - కోడలు: సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి - జ్యోతి

కుమార్తెలు - అల్లుళ్ళు

కట్టంరెడ్డి రాణీసంయుక్త - రాధాకృష్ణారెడ్డి

కేతిరెడ్డి ఉషారాణి - రామకోటారెడ్డి

| మనుమలు | మనుమరాండ్రు |
|---|---|
| సోమిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి | శ్రుతి |
| డా॥ సోమిరెడ్డి అర్జున్‌రెడ్డి | లక్ష్మీఐషిత |
| నిమ్మ కౌశిక్‌రెడ్డి | డా॥ సింధు |
| సన్నారెడ్డి శ్రీనివాస్‌రెడ్డి | నీలిమ |
| యల్లా సనత్‌రెడ్డి | షాలిని |
| డా॥ కేతిరెడ్డి కళాధర్‌రెడ్డి | డా॥ మాలిని |
| కేతిరెడ్డి శశధర్‌రెడ్డి | కీర్తి |
| కట్టంరెడ్డి విక్రమ్‌రెడ్డి | స్నిగ్ధ |

| మునిమనుమలు | మునిమనుమరాండ్రు |
|---|---|
| యల్లా శర్విన్ | యల్లా సంజన |
| కేతిరెడ్డి శ్రీమన్ | సోమిరెడ్డి శివాని |
| నిమ్మ ధీర్ | కేతిరెడ్డి శ్రితిక |
| కేతిరెడ్డి శ్రీవంత్ | కట్టంరెడ్డి శ్రీశాన్వి |
| | సన్నారెడ్డి నిరుక్తలేఖ |
| | సన్నారెడ్డి రాయల్ భార్గవ్ |

# నెల్లూరు కబుర్లు

## అసెంబ్లీలో పోలీసు సమస్యలు



ప్రజలు, ప్రజాప్రతినిధులకు పోలీసులను తిట్టడమే పనిగా వుంటుంది గాని వారికీ సమస్యలు ఉంటాయనే సంగతిని ఎవరూ గుర్తించరు. పోలీసు వ్యవస్థ మీద గౌరవమో, పోలీసుల మీదున్న అభిమానమో ఏమోగాని నెల్లూరు గ్రామీణ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి మాత్రం వారి సమస్యలపై తన వాదనను వినిపించారు. మార్చి 29వ తేదీన అసెంబ్లీలో హోంశాఖ సంస్కరణలపై జరిగిన చర్చలో ఆయన మాట్లాడుతూ హోంగార్డుల వేతనాలు వారి తిండి తిప్పలకు కూడా సరిపోవడం లేదని, వారికి కనీస వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఏపికి చెందిన 3వేల మంది హోంగార్డులు హైదరాబాద్‌లో పని చేస్తున్నారని, సరిపడా జీతాలు లేక ఇబ్బందులు పడుతున్నారని, వీరందరినీ సొంత జిల్లాలకు పంపించాలని కోరారు. రోజుకు 500 రూపాయలు వేతనమివ్వాలని, వారానికి ఒకరోజు సెలవు, టి.ఏ., డి.ఏలు ఇవ్వాలని, మహిళా హోంగార్డులకు 20రోజులు క్యాజువల్ లీవ్ ఇవ్వాలని, తెలంగాణ తరహాలో ట్రాఫిక్ పోలీసులకు పొల్యూషన్ అలవెన్స్ ఇవ్వాలని ఆయన సభలో డిమాండ్ చేశారు.

కాగా, అసెంబ్లీలో తమ సమస్యలపై మాట్లాడినందుకు జిల్లా పోలీసు సంఘం నాయకులు, హోంగార్డులు ఎమ్మెల్యే కోటంరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

## చిన్ని నారాయణరావు కవితకు 'మల్లెతీగ'




జాతీయ స్థాయిలో నిర్వహించిన మల్లెతీగ సాహితీ అవార్డు పోటీల్లో నెల్లూరుకు చెందిన రచయిత చిన్ని నారాయణరావు వ్రాసిన 'మహా దయాన్ని సృష్టిద్దాం' కవితకు ఉత్తమ కవితా పురస్కారం లభించింది. 27వ తేదీ ఆదివారం విజయవాడ ఎంబి హాల్‌లో జరిగిన సాహితీ కార్యక్రమంలో చిన్ని నారాయణరావుకు ప్రముఖ పాత్రికేయులు పద్మశ్రీ తుర్లపాటి కుటుంబరావు చేతుల మీదుగా ఈ అవార్డు బహుకరణ జరిగింది. నగదు అవార్డు శాలువా మెమెంటోలతో చిన్ని నారాయణరావును ఘనంగా సత్కరించారు. ఆయన చదివిన అవార్డు కవితకు సభికుల ప్రశంసలు లభించాయి.

## క్రమశిక్షణతో బోధన అవసరం

**- విశాఖపట్నం కలెక్టర్ యువరాజ్**

విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన బోధన అందించినప్పుడే భవిష్యత్తులో వారు ఉన్నత స్థాయికి చేరుకుంటారని విశాఖపట్నం జిల్లా కలెక్టర్, నెల్లూరుజిల్లా కలెక్టర్ యం.జానకి భర్త యువరాజ్ సూచించారు. గత నెల 26వతేదీ నెల్లూరు రెయిన్‌బో పాఠశాల కలర్స్ – 2016 వార్షిక వేడుకలు అనిల్ గార్డెన్స్‌లో నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథులుగా కలెక్టర్ జానకి దంపతులు హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ యువరాజ్ మాట్లాడుతూ విద్యార్థుల్లోని నైపుణ్యాలను వెలికి తీసేందుకు ఇటువంటి కార్యక్రమాలు ఎంతో దోహద పడుతాయన్నారు. అనంతరం కలెక్టర్ జానకి ఉత్తమ విద్యార్థులు, ఉపా ధ్యాయులకు జ్ఞాపికలు అందజేశారు. విద్యార్థులు ప్రదర్శించిన వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు, ఫ్యాషన్‌షో, ర్యాంప్ షోలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ పద్మా సుబ్రహ్మణ్యం, ప్రిన్సిపల్ అరుణా స్వయంప్రభ, కలివెలపాళెం పాఠశాల ప్రిన్సిపల్ రామగిరి విద్యాసాగర్, ప్రైమరి ఇన్‌ఛార్జి ఫాతిమా, డాన్స్ మాస్టర్లు నందన్, సురేష్, గోపి, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

## వన్‌టౌన్‌కు కరీం

నెల్లూరు 1వ నగర సిఐగా అబ్దుల్ కరీంను నియమించారు. ఇక్కడ ఇన్‌ఛార్జ్ సిఐగా వున్న కిషోర్‌బాబును గుంటూరు రేంజ్ విఆర్‌కు బదిలీ చేశారు. నగరంలో ఓ వర్గం వారితో వచ్చిన వివాదం మూలంగా సిఐగా వున్న నరసింహారావును బదిలీ చేసి ఇన్‌ఛార్జ్ సిఐగా కిషోర్‌బాబును పెట్టారు. ఇప్పుడు కరీంను పూర్తిస్థాయి సిఐగా పంపించారు. గుంటూరు జిల్లా నరసారావుపేటకు చెందిన కరీం 1998బ్యాచ్ ఎస్ఐగా ప్రకాశం జిల్లాలో తొలుత బాధ్యతలు చేపట్టారు. అదే జిల్లాలో ఎస్ఐగా పలు స్టేషన్లలో పని చేశారు. 2007లో సిఐగా పదోన్నతి పొందారు. నెల్లూరుజిల్లాలోనూ వెంకటగిరి సిఐగా ఇంటలిజెన్స్ సిఐగా సుదీర్ఘకాలం పని చేశారు. తర్వాత గుంటూరు జిల్లాలో పనిచేస్తూ ఇటీవలే దుగరాజపట్నం మెరైన్ సిఐగా బదిలీ అయినా బాధ్యతలు తీసుకోకుండా సెలవులో వున్నారు. ఇప్పుడు 1వ నగరానికి వచ్చారు.

# నెల్లూరు ట్రాఫిక్‌పై విశాల్ దృష్టి!



నెల్లూరుజిల్లాలో నేరాల సంగతేమో గాని నెల్లూరు నగరంలో ట్రాఫిక్ మాత్రం పోలీసులకు ఎప్పుడూ సవాలే! నెల్లూరులో ట్రాఫిక్‌ను కంట్రోల్‌లో పెడితే పోలీసులకు సగం భారం తగ్గినట్లే! ఎందుకంటే ఇంత పెద్ద నగరంలో వుండేది రెండే మెయిన్ రోడ్డులు. ఒకటి జిఎన్‌టి రోడ్డు, రెండోది మినీబైపాస్. నగరంలో 70శాతం ట్రాఫిక్ ఒక్క జిఎన్‌టి రోడ్డు మీదే నడుస్తుంది. నగరంలో 20వేలకు పైగా వున్న ఆటోలు ఈ రోడ్ల మీదే నడవాలి. ట్రంకురోడ్డులో ఎప్పుడు చూసినా ఆటోలు ర్యాలీ మాదిరిగా వెళుతుంటాయి. ఇలాంటి ట్రాఫిక్‌ను దారిలో పెట్టాలంటే ఎవరికైనా తలకు మించిన పనే! ట్రాఫిక్ పెరిగింది కదా అని ఇప్పటికిప్పుడు రోడ్లను వెడల్పు చేయడమో, రోడ్లను పెంచడమో చేయలేము. అడ్డదిడ్డంగా వున్న ట్రాఫిక్‌ను సరిదిద్దాలి. రోడ్ల మీద పార్కింగ్‌లను నిలువరించాలి. ట్రాఫిక్ రద్దీ వున్న వీధుల్లో వన్‌వే ట్రాఫిక్‌ను అమలు చేయాలి. సిటీ బస్సులు, ఆటోలు ఎక్కడపడితే అక్కడ ఆగకుండా చేయాలి. ప్రత్యేక స్టాపింగ్‌లను ఏర్పాటు చేయాలి. సోమవారం ట్రాఫిక్ అధికారులు, సిబ్బందితో ఈ విషయంపైనే ఎస్పీ విశాల్ గున్నీ సమావేశం నిర్వహించారు. ట్రాఫిక్ కంట్రోల్‌కు తీసుకోవాల్సిన చర్యలపై వారితో చర్చించారు. ట్రాఫిక్ పోలీసులు కొంచెం కష్టపడితే ట్రాఫిక్‌ను అదుపు చేయొచ్చని ఆయన అభిప్రాయపడ్డారు. ఎక్కడపడితే అక్కడ వాహనాలు నిలపకుండా చూడాలని, అవసరమైతే కఠిన చర్యలకైనా వెనుకాడవద్దని ఆయన సూచించారు. ట్రాఫిక్ పోలీసుల సరంజామాను కూడా ఆయన పరిశీలించారు. ఎండాకాలంలో ట్రాఫిక్ పోలీసుల విధులు కష్టంగా ఉంటాయి. కాబట్టి రోడ్లపై ఏర్పాటు చేసిన షెల్టర్లకు మరమ్మత్తులు చేయాలని సూచించారు. కొద్దిరోజుల్లోనే నెల్లూరు ట్రాఫిక్‌లో మార్పు తెచ్చేందుకు ఆయన ప్రయత్నిస్తున్నారు.

## క్రీడా గ్రామానికి సహకరించండి

**కేంద్రమంత్రి వెంకయ్యకు శాప్‌డైరెక్టర్ వినతి**



నెల్లూరుజిల్లాలోని మొగళ్ళపాళెంలో క్రీడా గ్రామం పూర్తి కావడానికి సహకరించాలని కేంద్రమంత్రి యం.వెంకయ్య నాయుడుకు శాప్ డైరెక్టర్ రవీంద్రబాబు విన్నవించారు. ఆదివారం విజయవాడలో కేంద్ర మంత్రిని కలిసిన రవీంద్రబాబు క్రీడా గ్రామాన్ని వెంటనే పూర్తి చేసి క్రీడాకారులకు నూతన ఉత్సాహాన్ని ఇవ్వాలని కోరారు. ఈ సందర్భంగా రవీంద్రబాబు మాట్లాడుతూ రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటి ఆదేశాల మేరకు మొగళ్ళపాళెం ప్రాంతంలో క్రీడా స్థలాన్ని పూర్తి స్థాయిలో ఏర్పరిచామన్నారు. అవుట్‌డోర్, ఇండోర్ స్టేడియంతో పాటు హాకీ స్టేడియం, 1500మందికి వసతి సౌకర్యం కలిగేలా గృహ సముదాయాలను నిర్మించాలని కోరారు.

## భక్తిశ్రద్ధలతో గుడ్‌ఫ్రైడే



నెల్లూరుజిల్లాలో క్రైస్తవ సోదరులు గుడ్‌ఫ్రైడేను గత నెల 25వ తేదీ భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. క్రీస్తును శిలువ వేసిన రోజు కావడంతో ఉపవాసదీక్షలతో ప్రభువును స్తుతించారు. నెల్లూరు సుబేదారుపేటలోని కెథడ్రిల్ చర్చిలో బిషప్ డాక్టర్ ఎండి ప్రకాశం ఆధ్వర్యంలో శిలువ మార్గం నిర్వహించారు. బైబిల్ వాక్యాలు, భక్తి గీతాలు ఆలపిస్తూ భక్తులు పాల్గొన్నారు. నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌యాదవ్ శిలువను మోశారు. ఫత్తేఖాన్‌పేటలోని పునీత ఆంథోని చర్చి ఆధ్వర్యంలో శిలువ మార్గం కనుల పండువగా జరిగింది. మాజీఎమ్మెల్యే ఆనం వివేకానందరెడ్డి శిలువను మోశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 17 సంవత్సరాలుగా గుడ్‌ఫ్రైడే పర్వదినం సందర్భంగా శిలువను మోస్తున్నానన్నారు. పొదలకూరురోడ్డులోని వియాని హోం ఆధ్వర్యంలో, బి.వి.నగర్ సెయింట్ ఇన్‌ఫాంట్ చర్చి ఆధ్వర్యంలో శిలువ మార్గం జరిగింది.

## ఉచిత వైద్య శిబిరం



నెల్లూరు విజయ కేర్ స్పెషాలిటి హాస్పిటల్ వారిచే నెల్లూరు ఎన్‌టిఆర్ నగర్‌లోని స్రవంతి ఇంగ్లీషు మీడియం స్కూలు కరస్పాండెంట్ మాదాల రాము సహకారంతో గత నెల 27వ తేదీన ఉచిత వైద్య శిబిరం జరిగింది. ఈ శిబిరంలో డాక్టర్ విజయకుమార్, డాక్టర్ అన్నపూర్ణ రోగులను పరీక్షించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎక్కువ మంది బిపి, షుగర్, జ్వరాలు, గర్భకోశ వ్యాధులతో బాధపడుతున్నారన్నారు. ఈ శిబిరంలో స్కూలు కరస్పాండెంట్ రాము, వైద్య సిబ్బంది పార్థసారథి, సోని, స్రవంతి, ప్రశాంతి, నర్మదా, వందన, ఎస్ఎండి షఫీ పాల్గొన్నారు.

## డిఆర్‌డిఏ పి.డిగా లావణ్యావాణి

నెల్లూరుజిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ పి.డిగా లావణ్యావాణిని నియమిస్తూ ప్రభుత్వం జివో విడుదల చేసింది. ఈమె చిత్తూరుజిల్లాలో సెట్విన్ సిఇఓగా పని చేస్తున్నారు. ఇక్కడ పని చేస్తున్న పిడి చంద్రమౌళిని ఏపి టూరిజం కార్పోరేషన్ (చిత్తూరు, కడప, నెల్లూరుజిల్లాలు) ఇడిగా నియమించారు.

## విమానాశ్రయ సలహా కమిటీ సభ్యుడిగా నల్లపరెడ్డి



తిరుపతి అంతర్జాతీయ విమానాశ్రయం సలహా కమిటీ సభ్యుడిగా కోట ఎంపిపి నల్లపరెడ్డి వినోద్‌రెడ్డిని నియమించారు. ఈ కమిటీకి ఛైర్మన్‌గా వున్న తిరుపతి ఎంపి వరప్రసాద్ ఈ నిర్ణయం తీసుకున్నారు.

## రాజేశ్వరమ్మ హుండీ రాబడి

నెల్లూరు దుర్గామిట్టలోని శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారి దేవస్థానం హుండీలను మార్చి 28వ తేదీ లెక్కించారు. జనవరి 30వ తేదీ నుండి మార్చి 28వ తేదీ వరకు హుండీల ద్వారా 10,25,213 రూపాయల ఆదాయం వచ్చింది. దేవాదాయశాఖ సహాయకమిషనర్ కార్యాలయం సూపరింటెండెంట్ వి.ఉష, ఆలయ ఛైర్మన్ రత్నం జయరామ్, ఇ.ఓ పి.కోదండరామిరెడ్డిలు హుండీల లెక్కింపును పర్యవేక్షించారు.

# వికలాంగులకు వేమిరెడ్డి చేయూత

## 5వేల మందికి ఆర్టీసీ ఉచిత పాస్‌లకు సహకారం



వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి తరపున వికలాంగుల బస్‌పాస్‌ల కోసం నగదు అందజేస్తున్న ఆయన ప్రతినిధి కేతంరెడ్డి వినోద్‌రెడ్డి

ఒకరికి మంచి చేయాలంటే ఆయన ఆసక్తి చూపిస్తాడు. పదిమందికి ప్రయోజనం కలుగుతుందంటే ఉత్సాహం చూపిస్తాడు. వందలు, వేల మందికి ఉపయోగం కలుగుతుందంటే అమిత ఉత్సాహం చూపిస్తాడు. పలువురికి మంచి చేసే కార్యక్రమాలకు అత్యంత హుషారుగా ముందుకు కదిలే ఆ వ్యక్తే వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి. జిల్లాలో సేవా కార్యక్రమాలను ఒక సునామీలా చేసుకు పోతున్న వేమిరెడ్డి జిల్లాలోని వికలాంగులకు సైతం తన చేయూతనందించాడు. జిల్లాలో వున్న 5వేలమంది వికలాంగులకు ఆర్టీసీ ఉచిత బస్సు పాస్‌లు ఇచ్చేందుకు వారి తరపున చెల్లించాల్సిన 1.25లక్షల రూపాయలను మొత్తం ఆయనే నెల్లూరు ఆర్టీసీకి కట్టేశాడు. ఈ బస్‌పాస్ ద్వారా వికలాంగులకు ఉచిత ప్రయాణంతో పాటు వారి సహాయకులకు కూడా ఛార్జీలో 50శాతం రాయితీ లభిస్తుంది. తమకు చేసిన ఉపకారం పట్ల జిల్లాలోని వికలాంగులందరు కూడా వేమిరెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతున్నారు.

## ప్రగతి ఛారిటీస్‌కు వితరణ



వదాన్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, ఆయన సతీమణి వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డిలు గత నెల 25వ తేదీ ప్రగతి ఛారిటీస్‌లోని విభిన్న ప్రతిభావంతులకు, అనాథలైన బాల బాలికలకు రూ.3లక్షలు విరాళం ఇచ్చి తమ దాతృత్వాన్ని చాటుకు న్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 5సంవత్సరా లుగా ప్రతి సంవత్సరం మార్చి నెలలో ఆ సంస్థ యొక్క మొత్తం ఖర్చును భరిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన అనాథపిల్లలతో ముచ్చటించి దీవెనలందజేశారు. ప్రగతి ఛారిటీస్ చేస్తున్న సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా ఆయనకు ప్రగతి ఛారిటీస్ ఛైర్మెన్ జె.వి.రెడ్డి, ట్రెజరర్ కృష్ణారెడ్డి, కార్యదర్శి సుశీల, సిబ్బంది కృతజ్ఞతలు తెలియజేశారు.

# అంగరంగ వైభవంగా రంగడి రథోత్సవం



నెల్లూరుజిల్లాకే తలమానికమైన నెల్లూరు, రంగనాయకులపేట లోని శ్రీ తల్పగిరి రంగనాథస్వామి దేవస్థానం బ్రహ్మోత్సవాల్లో భాగంగా గత నెల 25వ తేదీ రంగడి రథోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. జిల్లా నలుమూలల నుండే కాకుండా ఇతర జిల్లాల నుంచి భక్తులు వేలాదిగా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. దీంతో రంగనాయకులపేట, సంతపేట వీధులు కిటకిటలాడాయి. జైరంగ... జైజై రంగా... గోవిందా... హరి గోవిందా... నామస్మర ణలతో మార్మోగాయి. భక్తులు గుమ్మడికాయలు, ఉప్పు, మిరియాలు, కొబ్బరికాయలు, కర్పూర నీరాజనాలతో మొక్కులు తీర్చుకున్నారు. రథోత్సవం ఉదయం 9గంటలకు ప్రారంభమై మధ్యాహ్నం 1.30 గంటల వరకు సాగింది. మాజీఎమ్మెల్యే ఆనం వివేకానందరెడ్డి ఆధ్వర్యంలో మూలాపేట వేణుగోపాలస్వామి దేవస్థానం తరపున స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించారు. నెల్లూరు నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌యాదవ్, నగర మేయర్ అబ్దుల్ అజీజ్ గుమ్మడికాయ దిష్టి తీసి జెండా ఊపి ఉత్సవాన్ని ప్రారంభించారు. ఈ రథోత్సవ వేడుకలో నెల్లూరు ఎంపి మేకపాటి రాజమోహన్‌రెడ్డి, జడ్పీ ఛైర్మెన్ బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి, విజయ డెయిరీ ఛైర్మెన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, మాజీఎమ్మెల్యే ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి తదితర నగర ప్రముఖులు పాల్గొన్నారు.

పోలీసు శాఖ, కృష్ణపట్నం పోర్టు సెక్యూరిటి సిబ్బంది గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా ట్రాఫిక్‌ను నియంత్రించారు. రథోత్సవం సందర్భంగా స్వచ్ఛంద సంస్థలు, మునిసిపల్ శాఖ భక్తులకు మంచినీరు, మజ్జిగ చలివేంద్రాలను ఏర్పాటు చేశారు. రథోత్సవం తొలుత గోపురం వీధి నుండి రైల్వేట్రాక్ వరకు వెళ్ళి తిరిగి రంగనాయకులపేట, సంతపేట నాలుగుకాళ్ళ మండపం వరకు సాగి, తిరిగి దేవస్థానానికి చేరుకుంది. కిక్కిరిసిన భక్తులతో రంగడి రథోత్సవం వేడుకగా సాగింది.

*నేత్ర పర్వంగా పుష్పయాగం, తెప్పోత్సవం:* అలాగే సోమవారం రాత్రి శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ రంగనాథునికి పుష్పయాగ మహోత్సవం, మంగళవారం రాత్రి పవిత్ర పెన్నానదిలో శ్రీ స్వామివారి తెప్పోత్సవం నేత్రపర్వంగా జరిగాయి. శాస్త్రోక్తంగా జరిగిన పుష్పయాగానికి భక్తులు వివిధ రకాల పుష్పాలను సమర్పించారు. అనంతరం పుష్పాలంకరణ శోభితుడైన రంగనాథస్వామి మంగళవాయిద్యాల నడుమ శ్రీదేవి, భూదేవిలతో దవనోత్సవంలో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. బ్రహ్మోత్సవాల ధ్వజావరోహణ కార్యక్రమం శాస్త్రోక్తంగా నిర్వహించారు. మంగళవారం రాత్రి వివిధ పుష్పాలతో, విద్యుద్దీపాలంకరణలతో అందంగా అలంకరించిన తెప్పోత్సవంలో శ్రీదేవి భూదేవి సమేత శ్రీ రంగనాథుని ఉత్సవ విగ్రహాలను ఆలయ అర్చకులు విశేషపూజలు అనంతరం తెప్పలో ప్రతిష్ఠించారు. మంగళవాయిద్యాలతో బాణా సంచాలతో తెప్పోత్సవం పెన్నానదిలో విహరించి భక్తులకు కనువిందు చేసింది. ఈ కార్యక్రమంలో భక్తులు విశేషంగా పాల్గొని పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమాలను ఆలయ కార్యనిర్వహణాధికారి పోరెడ్డి శ్రీనివాసులురెడ్డి పర్యవేక్షించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.


# భుజం నొప్పితో సమస్యలెన్నో

Apollo SPECIALITY HOSPITALS
TOUCHING LIVES

*భుజం తుంటి మన శరీరంలో తేలికగా కదిలే కీలు. ఇది బంతి, గిన్నె ఆకారంలో వుండే కీలు. అటూ ఇటూ కదులుతూ వుండడమే దాని పని. అది అసౌకర్యంగా కదిలినపుడు తీవ్రమైన నొప్పి కలుగుతుంది. ఆ నొప్పి తాత్కాలికంగానైనా ఉండవచ్చు, లేదా శాశ్వతంగానైనా వుండవచ్చు. పనిచేసేటప్పుడు లేదా విశ్రాంతిగా వున్నప్పుడు కూడా కలగవచ్చు. కాలం విలువైనది కాబట్టి, వెంటనే దానికి కారణం పరిశీలించి తెలుసుకొని చికిత్స పొందాలి. మధుమేహ రోగులు (కీళ్ళు పట్టేయడం లేదా దాని పని వేగం మందగించడం వల్ల) ఈ యిబ్బందికి ఎక్కువగా గురవు తుంటారు. భుజం కీలు భుజం పైభాగం ఎముకకు(హ్యూమరస్), స్కాపులా మరియు కాలర్ ఎముకకు(క్లావికల్) అనుసంధానం కలిగిస్తుంది.*



Dr. Vivekananda Reddy.C
M.B.B.S.,, MS, (Ortho) FIJR
CONSULTANT JOINT REPLACEMENT &
ARTHROSCOPY SURGEON
APOLLO SPECIALITY HOSPITALS
Nellore

## కారణాలు:

1. *విరగడం & గాడి తప్పడం:* నొప్పి మరియు భుజం వాపు కనబడుతుంది. భుజం కదిలించలేరు.

2. *సబ్ ఏక్రోమియల్ బర్సైటిస్, సబ్ ఏక్రోమియల్ ఇంపింజ్‌మెంట్:* ఇందువల్ల నొప్పి కలిగి చేయి పైకి ఎత్తలేరు. ఈ కీలులో బర్సా వుంటుంది. ఇది కీలు మధ్యలో రాపిడిని తగ్గించి, మృదువుగా, తేలికగా అటూ యిటూ కదిలేందుకు సహకరిస్తుంటుంది.

3. *రొటేటర్ కఫ్ టెండినైటిస్:* టెండాన్లు అనేవి ఎముకలను, కండరాలను కలుపుతూ వుండే కణాలు. తీవ్రమైన బాధకు గురైనపుడు దీనిని టెండినైటిస్ అంటారు. కాలక్రమంలో ఇది అరిగిపోవడం జరుగుతుంది. వెంటనే చికిత్స తీసుకోకపోతే పూర్తిగా కండ తెగిపోయి కీలు అరిగిపోతుంది.

4. *రొటేటర్ కఫ్ టియర్స్:* వయసు కారణంగా గాని, అధిక శ్రమకు గురైనపుడు గాని టెండాన్లు ప్రక్కకు కదిలిపోవడం వల్ల భుజం వద్ద తీవ్రమైన నొప్పి ఏర్పడుతుంది. భుజానికి గాయాలైనపుడు కూడా ఇలా జరుగుతుంది.

5. *అస్థిరమైన భుజాలు:* బంతి లాంటి భాగం, గిన్నె వంటి కీలు భాగం నుండి బయటకు వచ్చినపుడు ఇలా జరుగుతుంది. అది కొద్దిగా బయటకు వచ్చినపుడు సాధారణంగా తిరిగి దాని స్థానంలోకి వెళ్ళిపోతుంటుంది. కాని పూర్తిగా బయటకు వచ్చినపుడు భుజం పనిచేయడం మానేస్తుంది. దానికి వెంటనే చికిత్స తీసుకోకపోతే అది ఇంకా తీవ్రమై, భుజం శక్తి కోల్పోయి, కదిలించలేని స్థితి ఏర్పడుతుంది. లేదా కీలు మాటిమాటికీ గతి తప్పడం మరియు అరిగిపోవడం జరుగుతుంది.

6. *భుజం వాపు:* ఆస్టియో ఆర్థ్రయిటిస్ అనేది సాధారణంగా కనబడే వ్యాధి. ఇది నొప్పి, మంట, వాపు కలిగి యిబ్బందికరంగా వుంటుంది. అసాధారణమైన స్థితిలో ఏర్పడిన వాటిని రుమటాయిడ్ ఆర్థ్రయిటిస్, సీరోనెగటివ్ ఆర్థ్రయిటిస్, రీటర్స్ సిండ్రోమ్ & గౌట్ అని రకరకాలుగా ఉంటాయి.

7. *పెరియార్థ్రయిటిస్ (అడ్‌హెసివ్ క్యాప్సులైటిస్):* సాధారణంగా భుజంలోని కీలు కదిలినపుడు నొప్పి, మంట, వాపు వంటివి వుంటాయి. దీనికి వెంటనే చికిత్స తీసుకోకపోతే బాధ ఇంకా ఎక్కువౌతుంది. కీలు పట్టేయడం, కదలకపోవడం వంటి యిబ్బంది పెరిగి, భుజం కదిలించలేని స్థితి ఏర్పడుతుంది. కీలు గట్టిగా పట్టేస్తుంది. మధుమేహ వ్యాధిగ్రస్తులలో ఈ ఇబ్బంది ఎక్కువగా కనబడుతుంది.

8. *సర్వైకల్ రాడిక్యులోపతి:* డిస్కు జారిపోవడం వల్ల మెడ దగ్గర నొప్పి ప్రారంభమై, అది భుజం ఎముక వరకు పాకుతుంది.

## లక్షణాలు:

సాధారణంగా నొప్పి, వాపు కనిపిస్తాయి. భుజం కదలికలో ఇబ్బంది వల్ల బిగునుకుపోవడం జరుగుతుంది.

*వ్యాధి నిర్ధారణ:* రోగి యొక్క లక్షణాలు మరియు రోగిని పరిశీలించడం ద్వారా వ్యాధిని నిర్ధారించవచ్చు. ఎక్స్‌రే, యం.ఆర్.ఐ. స్కాన్, ఆర్థ్రోగ్రామ్, నరాల పరీక్షలు చేయాల్సి వుంటుంది.

## చికిత్స:

1. *మందులు:* నొప్పి మరియు వాపు తగ్గేందుకు నొప్పిని నివారించే మందులు, పూతమందులు, కాల్షియం & విటమిన్ పోషకాలు వాడాలి.

2. *పనులలో మార్పు:* తీవ్రమైన ఒత్తిడి వుండే పనులు చేయకూడదు.

3. వ్యాయామం & వేడి నీళ్ళ కాపడం

4. *ఫిజియో థెరపి:* అల్ట్రాసౌండ్, ఐ.ఎఫ్.టి., టెన్స్ అయంటోఫోరెసిస్.

5. పెరియార్థ్రయిటిస్ మామూలుగా మధుమేహ వ్యాధిగ్రస్తుల్లో కనబడుతుంది. రక్తంలో చక్కెర శాతాన్ని తగ్గించే మందులు వాడడం, తగిన ఆహారం తీసుకోవడం, తేలికైన మెడ, భుజం వ్యాయామం చేయడం వల్ల దీన్ని నివారించవచ్చు.

6. *ఆర్థ్రోస్కోపి:* కీలు తొలగిన భాగంలో చిన్న రంధ్రం చేసి కీలును సరిచేయడం ద్వారా ఇబ్బందిని తొలగించే విధానం.

7. *భుజం మార్పిడి:* ఆస్టియో ఆర్థ్రయిటిస్ చివరిదశలో ఈ చికిత్స అవసరమవుతుంది. పూర్తిగా భుజం కీలు తొలగించి, మరల నూతన కీలును అమర్చడం ద్వారా ఈ చికిత్స చేస్తారు.


# కళ్యాణ వైభవం...!



శైలజ నర్సింగ్‌హోమ్ అధినేత డా॥ జి.రవీంద్రనాథ్ ఠాగూర్ - డా॥ శైలజల కుమార్తె **డా॥ భావన - డా॥ రాహుల్‌బాబు** (గుంటూరు జిల్లా వినుకొండ వాస్తవ్యులు కొండూరు సత్యనారాయణ - ఉమామహేశ్వరిల కుమారుడు)ల కళ్యాణం మార్చి 24వ తేదీ ధనలక్ష్మీపురంలోని కెజికె కళ్యాణ మండపంలో జరిగింది. నూతన వధూవరులకు 'లాయర్' శుభాశీస్సులు.



నెల్లూరు వాస్తవ్యులు చాకిరి చెన్నకేశవులు - విజయలక్ష్మిల కుమార్తె **శ్రావణి - సుకేష్** (ఆత్మకూరు వాస్తవ్యులు ఆవుల నరసింహం - నాగమణిల కుమారుడు)ల పరిణయం మార్చి 23వ తేదీ నెల్లూరులోని హోటల్ మినర్వ గ్రాండ్ నందు జరిగింది. కొత్త జంటకు 'లాయర్' శుభదీవెనలు.



గూడూరు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు బొల్లినేని కోటేశ్వరరావు - మంజుల కుమారుడు **గౌతమ్‌కష్ణ - సాయిలేఖ్య**(వెంకటాచలం వాస్తవ్యులు కొత్తపల్లి వెంకటేశ్వరరావు - పద్మల కుమార్తె)ల వివాహం మార్చి 24వ తేదీ నెల్లూరు స్రిడ్స్ ఫంక్షన్ హాలులో వైభవంగా జరిగింది. వధూవరులకు 'లాయర్' శుభాకాంక్షలు.



నెల్లూరు వాస్తవ్యులు నాతా కృష్ణకుమార్ - శాంతిల కుమారుడు **అశ్విన్‌కుమార్ - దివ్య** (కోట వాస్తవ్యులు దుగ్గిశెట్టి శ్రీనివాసులు - శైలజల కుమార్తె)ల పెళ్ళి మార్చి 24వ తేదీ నెల్లూరులో ఏ.ఎల్.రావు కళ్యాణ మండపంలో జరిగింది. వధూవరులకు 'లాయర్' శుభాశీస్సులు

# వేములపాలెం ప్రాథమిక పాఠశాల వార్షికోత్సవం



బహుమతులు అందజేస్తున్న ఎంఇఓ, ప్రధానోపాధ్యాయుడు, సర్పంచ్

గూడూరు మండలం వేముల పాలెం ప్రాథమిక పాఠశాల వార్షికోత్సవం గత నెల 26వ తేదీ ఆ స్కూలు ప్రధానోపాధ్యాయులు కొండూరు రామరాజు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మండల విద్యాశాఖాధికారి యం.డి.ఇస్మాయిల్ పాల్గొని మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నతవిద్యను అభ్యసించి పైకి రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో దివిపాళెం సర్పంచ్ పిట్టు చంద్రసేన, ఎంపిటిసి సభ్యులు, ఉపాధ్యాయిని నాగలక్ష్మి, కడివేటి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు. సరస్వతిపూజ, సాంస్కృతిక కార్యక్రమాలు జరిగిన అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు.

## గూడూరు డివిజన్ వార్తలు

# తెదేపా ఆవిర్భావ దినోత్సవ వేడుకలు



మాట్లాడుతున్న చైర్‌పర్సన్ పొనకా దేవసేన, పక్కన నియోజకవర్గ ఇన్‌ఛార్జి జ్యోత్స్నలత తదితరులు

గూడూరు పట్టణంలోని గడియారపు స్థంభం కూడలి వద్ద మంగళవారం తెలుగు దేశం పార్టీ 35వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి డాక్టర్ జ్యోత్స్నలత మాట్లాడుతూ తెలుగుదేశంపార్టీ తెలుగు ప్రజల జీవితాల్లో వెలుగులు నింపేందుకు ఏర్పాటైన పార్టీ అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మెన్ పొనకా దేవసేన మాట్లాడారు. వైస్‌ఛైర్మెన్ కిరణ్ కుమార్, పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు పులిమి శ్రీనివాసులు, గూడూరు మండల పార్టీ అధ్యక్షుడు బొల్లినేని కోటేశ్వరరావు, నాయకులు గోను శివకుమార్, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# సబ్‌కలెక్టర్ ఆఫీసులో రెవెన్యూ వినతులు



మాట్లాడుతున్న ఎవో గీతావాణి

గూడూరు డివిజన్‌లోని పలు గ్రామాల్లో ఉన్న భూ సమస్యలపై అర్జీదారులు సోమవారం సబ్‌కలెక్టర్ ఆఫీసులో డివిజన్ అడ్మినిస్ట్రేషన్ అధికారి గీతావాణికి అర్జీలను సమర్పించారు. సబ్‌కలెక్టర్ గిరీషా ముత్యాలమ్మ జాతర పర్యవేక్షణ కోసం వెళ్లడంతో సబ్‌కలెక్టర్ కార్యాలయంలో ఏవోకు వినతులు అందించారు. బాలాయపల్లి మండలం కోటంబేడు నాయుడు చెరువు కండ్రిగ గ్రామానికి చెందిన పేదలకు భూములను పంపిణీ చేయాలని విన్నవించారు. గూడూరు, చిల్లకూరు, సైదాపురం, దక్కిలి, కోట, వాకాడు, చిట్టమూరు తదితర మండలాలకు చెందిన అర్జీదారులు వినతులను అందించి న్యాయం చేయాలని కోరారు. ఏవో గీతావాణి విలేకర్లతో మాట్లాడుతూ ఇచ్చిన అర్జీలను సబ్‌కలెక్టర్‌కు ఇచ్చి న్యాయం జరిగేలా చూస్తానని అన్నారు.

# బిఎస్ఎన్ఎల్ వినియోగదారులకు వర్క్‌షాప్



మాట్లాడుతున్న బిఎస్ఎన్ఎల్ సిజిఎం రవిబాబు తదితరులు

ప్రిన్సిపల్ జనరల్ మేనేజర్ నెల్లూరు వారి ఆధ్వర్యంలో బియస్ఎన్ఎల్ వినియోగదారుల అవగాహన సదస్సు సోమవారం బిఎస్ఎన్ఎల్ ఆఫీసులో జరిగింది. ఈ సందర్భంగా వి.గంగిరెడ్డి(సిఎజి) మెంబరు మాట్లాడుతూ బిఎస్ఎన్ఎల్ టెలిఫోన్ సేవలు ప్రప్రథమంగా దేశంలో వచ్చిన తరువాత ధరలు చాలా తగ్గాయన్నారు. పల్లెల్లో కూడా బిఎస్ఎన్ఎల్ సర్వీసులు అందుబాటులో ఉన్నాయన్నారు.

సిజిఎమ్ ఎమ్.రవిబాబు మాట్లాడుతూ వినియోగదారులు తమ సమస్యలను నెట్ ద్వారా తెలియపరచవచ్చని, బిల్లులు కూడా నెట్ ద్వారా చెల్లించవచ్చని తెలిపారు. కొంతమంది వినియోగదారులు సూచించిన సలహాలను స్వీకరించి సేవలను మెరుగు పరుస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో గూడూరు బిఎస్ఎన్ఎల్ డిఇ వాన కృష్ణమూర్తి, ఎస్‌డిఇ టి.మనోహర్‌రెడ్డి, డిజిఎమ్ ఫైనాన్స్ అంకయ్య, డిజిఎం ఆపరేషన్స్ మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# ఆనం ఇంట కోడి బిరియాని కథ

గల్పిక

ఐఆర్ 20-420 మున్సిపల్ కార్పొరేషన్ ముదురుదోమలకు ప్రసిద్ధిగాంచిన నెల్లూరు నగరంలో ఆనంవారి వీధి. ఆ సందులో స్టైల్ ఆఫ్ సింహపురి, మాజీఎమ్మెల్యే ఆనం వివేకానందరెడ్డి ఇల్లు. వివేకా తన బెడ్‌రూంలో పడుకుని వున్నాడు. కళ్లు తెరిచాడు. గదంతా చీకటిగా ఉండడంతో, ఇంకా తెల్లారినట్లు లేదులే అనుకుని మళ్లీ కళ్లు మూసుకున్నాడు. వెంటనే వివేకా సెల్‌ఫోన్ మోగింది. వివేకా దానిని అందుకుని చూశాడు. అది నైట్‌రైడర్, ముదురుదోమల మంత్రి పి.నారాయణ నుండి వస్తున్న కాల్. ఈ అర్థరాత్రి మంత్రొకడు... టైమూ, పాడు లేకుండా ఫోన్‌లు చేస్తుంటాడని మనసులో అనుకుని ఫోన్ ఎత్తి... ఏం నారాయణ, ఇలా అర్ధరాత్రి వేళ ఫోన్ చేస్తున్నావ్, ఎక్కడన్నా తనిఖీలున్నాయా? అని అడిగాడు. అవతల నుండి నారాయణ... ఇంకా అర్ధరాత్రేందన్నా, తెల్లారింది. మీ ఇంటికి టిఫిన్‌కు వద్దామని ఫోన్ చేశానన్నాడు. ఏం మీ ఇంట్లో టిఫిన్ చేయలేదా? అని వివేకా అడిగాడు. దానికి నారాయణ... అదేంలేదన్నా, మీ ఇంటికొచ్చి మిమ్మల్ని ఒకసారి పలుకరించినట్లుంటుందని టిఫిన్ ప్రోగ్రామ్ పెట్టుకున్నానని చెప్పాడు. అలాగైతే రా... వేడి వేడి బిరియాని తయారు చేయిస్తానని వివేకా ఫోన్ పెట్టేసాడు. తర్వాత ఆయనే మనసులో తెల్లారితే ఈ గదంతా చీకటిగా ఉందేంటబ్బా అనుకుంటూ ముక్కు మీద దురద పుట్టడంతో గోక్కోవడానికి వేలు అక్కడ పెట్టాడు. అప్పుడు కళ్లకున్న నల్లద్దాలు వేలుకు తగిలాయి. వివేకాకు విషయం అప్పుడర్థమైంది. రాత్రి పడుకునేముందు కళ్లకున్న నల్లద్దాలు తీసి పక్కనపెట్టలేదని. వివేకా లేచి రెడీ అయ్యి క్రింద కొచ్చాడు. ఆ పక్కనే చెట్టు మీదున్న కోడి వైపు చూశాడు. అది కూడా ఇతని వైపు చూసింది. వివేకాను చూస్తూ ఆ కోడి... దినదిన గండం నూరేళ్ల ఆయుష్షు అన్నట్లుగా ఉంది నా బ్రతుకు. ఏదో ఒక రోజు ఇతని బిరియానికి నేను బలి కావడం ఖాయమని ఆ కోడి నిర్ణయించుకుంది. వివేకా చెట్టెక్కాడు. 65ఏళ్ల వయసులో వున్న వివేకాను పరుగులు పెట్టించడం ఎందుకులే అని విశాల హృదయంతో ఆలోచించిన కోడి ఎలాంటి ప్రతిఘటన లేకుండానే వివేకా చేతికి చిక్కింది. వివేకా దానిని తీసుకొచ్చి వరండాలో వేలాడ కట్టాడు.

అంతలోనే అక్కడకు నారాయణ, మేయర్ అబ్దుల్ అజీజ్, బీద రవిచంద్ర, చాట్ల నరసింహారావులు వచ్చారు. ఆనం రామ నారాయణరెడ్డి, ఏసి సుబ్బారెడ్డి, రంగమయూర్‌రెడ్డిలు వారిని లోపలకు తీసుకెళ్లారు. నారాయణతో రామనారాయణరెడ్డి... మీ కోసం అన్న చాలా కష్టపడి కోడి బిరియాని తయారు చేయిస్తున్నాడని చెప్పాడు. ఆ మాటకు నారాయణకు నోట్లో నీళ్లు వరదలా ఊరాయి. అలా నడుచుకుంటూ వరండాలోకి వచ్చారు. అక్కడ వేలాడదీసి వున్న కోడిని చూసి నారాయణ షాకయ్యాడు. అతనికి వెంటనే 'అహనా పెళ్లంట' సినిమా సీన్ గుర్తుకొచ్చింది. ఆ సినిమాలో కోట శ్రీనివాసరావు ఎదురుగా కోడిని వేలాడదీసుకుని వట్టి అన్నం తింటూ బిర్యాని తింటున్నట్లుగా ఫీల్ అవుతుంటాడు. వివేకా కూడా నాకు అలాంటి బిరియాని ఏమన్నా ప్లాన్ చేశాడా అని శంకించసాగాడు. అప్పుడే వివేకా వచ్చి... లోపల మసాలా నూరిస్తున్నాను, ఈలోపు మనం ఈ కోడి బొచ్చు పీకి బిరియాని ముక్కలు కొడదామన్నాడు. అందుకు నారాయణ... నాకు కోడి బొచ్చు పీకడం చేతకాదన్నాడు. కోడి బొచ్చు పీకలేని వాడివి, ఇంకేం పీకుదామని మంత్రివయ్యావని వివేకా మనసులో అనుకుని, పైకి మాత్రం... బొచ్చు నేను పీకుతాను, నువ్వు చూస్తూ నేర్చుకో, ఈసారెప్పుడన్నా ఉపయోగపడుతుం దన్నాడు. ఈ బొచ్చు సబ్జెక్ట్ నాకు అంత అవసరమా, పొరపాటున టిఫిన్‌కు వస్తానన్నందుకు నాకు ఈ బొచ్చు హింస ఏందనుకుంటూ నారాయణ ఆ బొచ్చు పీకుడు కార్యక్రమంలో వివేకాకు సహక రించాడు. తర్వాత బిరియాని తయారు చేయడం, టేబుల్ మీద పెట్టడం జరిగింది. అందరూ డైనింగ్ టేబుల్ వద్ద కూర్చున్నారు. నేను రానన్నా ఈ మంత్రి బలవంతంగా ఇక్కడకు లాక్కొచ్చాడు, ఇక్కడ వీళ్లేం ఫిటింగ్ పెడతారో ఏమోనని అజీజ్ ఆందోళన చెందసాగాడు. నారాయణ, రవిచంద్ర, అజీజ్‌లకు ఆనం బ్రదర్స్, వారి సన్స్ కొసరి కొసరి వడ్డించారు. ముఖ్యంగా అజీజ్‌కైతే ఆనం రంగమయూర్‌రెడ్డి దగ్గరుండి అన్నీ చూసుకున్నాడు. ఆ సమయంలోనే ఒంటి మీద దోమ వాలడంతో మంత్రి నారాయణ గట్టిగా కొట్టి ఆ దోమను చంపాడు. అది చూసి వివేకా... ఈ మున్సిపాల్టీ పనికి మాలిన తనానికి ఈ దోమలే ఒక ఉదాహరణ. ఇలాంటి దోమలు ప్రపంచంలో ఇంకెక్కడా వుండవ్. ఈ దోమలను అరికట్టకుండా పాలకులు నిద్రపోతున్నారు. కలెక్షన్‌ల మీద పడ్డారు. ఊరి నిండా కుక్కలు, పందులు, ఎక్కడి చెత్త అక్కడే, నగరం నరకంగా మారిందను కోండి, నువ్వేమంటావ్ అజీజ్ అంటూ వివేకా నాలిక కరుచుకుని... అయ్యయ్యో అజీజ్, నువ్వే మేయర్ వన్న సంగతి గుర్తులేకుండా నిజాలన్నీ వాగేశాను, ఏమీ అనుకోవద్దే, ఈ మున్సిపాల్టీలో ఇవన్నీ ఇలా ఎప్పుడూ వుండేవేలే... నువ్వు మేయర్ అయినా, నేను మేయర్‌గా వున్నా ఇవన్నీ తప్పవు అని అన్నాడు. అజీజ్ మనసులో గిల్లి జోలపాట పాడడమంటే ఇదే... అనాల్సినవన్నీ అనేసి, ఈ బుజ్జగింపు దేనికి అని మనసులో అనుకున్నాడు. తర్వాత నారాయణ.. మున్సిపాల్టీ వ్యవహారాలలో అజీజ్‌కు మీ సహకారం కావాలి, ఒకరికొకరు సహకరించుకుని పని చేయాలని కోరాడు. అందుకు వివేకా... మేమడిగిన పనులు చేస్తుంటే మా సహకారం ఎప్పుడూ వుంటుంది. అయినా మా పసుపు, కారం తిన్నోళ్లు మేం చెప్పిన పనులు చేయకుండా వుంటారా అని అన్నాడు. అందుకు నారాయణ... అదేంటి 'మా ఉప్పు తిన్నోళ్లు' అని కదా అనాల్సిందని అడిగాడు. వివేకా స్పందిస్తూ... ఇప్పుడు కూరలో ఆరోగ్యానికి మంచిది కాదని ఉప్పు వేయడం లేదు. అందుకే పసుపు, కారం అని వాడాను... ఇది మీరు కూడా గుర్తు పెట్టుకోండి అని చెప్పాడు. ఆనం రామనారాయణరెడ్డి కల్పించుకుని మా ఇంట్లో పాలేరుకు ఒక పూట తిండి పెడితేనే మూడుపూట్ల నమ్మకంగా పని చేస్తుంటాడు, వాళ్ళకున్న పాటి నమ్మకం మీకు ఉంద నుకుంటాను. మా ఇంటి బిరియాని తిని మా ఇంటి వాసాలు లెక్కపెట్టి నోళ్లు ఇంత వరకు బాగుపడిన చరిత్ర లేదని అన్నాడు. వారి మాటలకు ఖిన్నుడైన నారాయణ మనసులో పిలిచి తన్నించుకోవడమంటే ఇదే నేమోననుకుంటూ వెళ్లడానికి లేచాడు.

## మేషం



అశ్వని, భరణి, కృతిక 1 పాదము

దూరప్రయాణాలు, శుభకార్యాలలో పాల్గొనడం జరుగుతుంది. అనుకున్న పనులు నిదానంగా జరుగు తున్నా సానుకూలం కాగలవు. వృత్తి వ్యాపారాలలో స్వల్ప అభివృద్ధి ఆదాయముంటుంది. వ్యాపారవృద్ధి, కొత్త ప్రణాళికలను నిర్ణయం చేస్తారు. ఆదాయానికి తగినట్లు అదనపు ఖర్చులుంటాయి. ప్రముఖులతో పరిచయాలు, ఉద్యోగార్ధులకు అవకాశాలు బాగుంటాయి.

## వృషభం



కృతిక 2, 3, 4 పాదాలు, రోహిణి, మృగశీర్ష1, 2పాదాలు

ప్రభుత్వ అనుమతులు, ఋణాలు లభించగలవు. వ్యాపార ఆర్థిక వ్యవహారాలు అభివృద్ధికరంగా ఉండి సమర్థవంతంగా నిర్వహిస్తారు. వ్యవహారాలలో నిర్ణయాల వల్ల మంచి జరుగుతుంది. సన్నిహితుల వల్ల చిరు సమస్య లుండవచ్చును. రాజకీయ వర్గాలకు పలుకుబడి బాగుంటుంది. ప్రముఖులను ఆత్మీయులను కలుసు కొంటారు. వృత్తి పరంగా ఆదాయం పెరుగుతుంది.

## మిధునం



మృగశీర్ష 3,4 పాదాలు, ఆర్ధ్ర, పునర్వసు 1, 2, 3పాదాలు

అనుకున్న పనులు సరిగా జరగవు. అయినా మనో ధైర్యానికి లోపం లేకుండా ప్రయత్నిస్తారు. వృత్తి వ్యాపా రాలలో మెరుగైన అవకాశాలు చేజారిపోవచ్చును. అదనపు ఖర్చులు పెరుగుతాయి. ఆత్మీయుల సహకా రంతో సమస్యను అధిగమిస్తారు. ఉన్నత విద్యావకాశాలు బాగుంటాయి. వ్యాపారవర్గాలకు అధికారుల వల్ల ఇబ్బందులుంటాయి. ఆరోగ్యం ఫరవాలేదు.

## కర్కాటకం



పునర్వసు 4 పాదం, పుష్య, ఆశ్లేష

ముఖ్యమైన విషయాలలో సమయోచిత నిర్ణయాలు తీసుకొంటారు. ఉద్యోగులు అధికారులకు సన్నిహితం కాగలరు. అయినా పనిభారం ఎక్కువగా ఉంటుంది. వృత్తి వ్యాపారాలలో అభివృద్ధి ఆదాయం బాగుంటుంది. కొత్త వ్యాపార అవకాశాలు, కొత్త పెట్టుబడి అవకాశా లుంటాయి. ఆరోగ్యం ఫరవాలేదు. బిడ్డల విద్యావకా శాలు, శుభకార్య అవకాశాలు లభించగలవు.

## సింహం



మఖ, పుబ్బ, ఉత్తర 1పాదము

నూతన పెట్టుబడులు పథకాలు లభిస్తాయి. ఉద్యోగ ప్రయత్నాలలో ఇంటర్వ్యూ అవకాశాలు లభిస్తాయి. ఆత్మీయులు, కుటుంబసభ్యుల కొరకు ఖర్చులు పెరుగు తాయి. వృత్తి వ్యాపారాలలో ఆదాయం పెరగడం, అభివృద్ధి ఉంటుంది. బిడ్డల వ్యవహారాలు సమస్యాత్మ కంగా ఉంటాయి. కాంట్రాక్టర్లకు, బిల్డర్లకు సమస్యలుండ వచ్చును. ఆరోగ్యం బాగుంటుంది.

## కన్య



ఉత్తర 2, 3, 4 పాదాలు, హస్త, చిత్త 1, 2 పాదాలు

మిమ్మల్ని కాదన్నవారు కూడా మీకు సన్నిహితులు కాగలరు. బంధువులతో సత్సంబంధాలు ఏర్పడతాయి. ఉద్యోగార్ధులకు అవకాశాలు రాగలవు. పనులు నిదా నంగా జరగడం వల్ల టెన్షన్ ఎక్కువగా ఉంటుంది. ఉద్యోగ బాధ్యతలను సమర్ధవంతంగా నిర్వహిస్తారు. బాకీల విషయంలో కొంత సర్దుబాటు జరుగుతుంది. సోదరు లకు అభివృద్ధి బాగుంటుంది.



బ్రహ్మశ్రీ స్వయంపాకుల శ్రీనివాసులు
బాలాజీనగర్, నెల్లూరు

## రాశి - మీ వాసి

తేది. 1.04.2016 నుండి
తేది. 7.04.2016 వరకు

ఈ వారము సింహయి గురురాహువులు, వృశ్చికంలో శనికుజులు, ధనుస్సు మకర కుంభ మీన రాశులలో చంద్రుడు, కుంభంలో కేతువు, మీనంలో రవి బుధ శుక్రులు, 2తేది నుండి మేషంలో బుధుడు సంచరిస్తారు.

**పంచాంగము:**

ముహూర్తములు లేవు

**ఫాల్గుణ మాస కృష్ణపక్ష తిధులు**

| | | | |
|---|---|---|---|
| తేది. 1 | శుక్ర | నవమి | రా॥ గం.3.35వ॥ |
| తేది. 2 | శని | దశమి | రా॥ గం.2.48వ॥ |
| తేది. 3 | ఆది | ఏకాదశి | రా॥ గం.1.29వ॥ |
| తేది. 4 | సోమ | ద్వాదశి | రా॥ గం.11.51వ॥ |
| తేది. 5 | మంగళ | త్రయోదశి | రా॥ గం.9.52వ॥ |
| తేది. 6 | బుధ | చతుర్దశి | రా॥ గం.7.43వ॥ |
| తేది. 7 | గురు | అమావాస్య | రా॥ గం.6.00వ॥ |

## తుల



చిత్త 3, 4 పాదాలు, స్వాతి, విశాఖ 1, 2, 3 పాదాలు

వ్యవహారాలలో అనుకూలత సరిగా ఉండక ఇబ్బందులు పడతారు. బంధువులతో, ఇతరులతో మన స్పర్ధలుండవచ్చును. వృత్తి జీవనం కలవారికి, ఏజెంట్లకు మంచి అవకాశాలు దొరకగలవు. వ్యాపారవర్గాలకు సామాన్య ఆదాయం ఉంటుంది. మంచి వ్యాపారావకా శాలు చేజారిపోవచ్చును. విద్యార్థులకు మంచి ఉన్నత విద్యావకాశాలు లభించగలవు.

## వృశ్చికం



విశాఖ 4 పాదం, అనూరాధ, జ్యేష్ఠ

వృత్తి వ్యాపారాలు అభివృద్ధికరంగా ఉండి ఆదాయం పెరుగుతుంది. బంధుముఖ్యులకు అనారోగ్య బాధ లుంటాయి. వాహనాలు నడిపేవారు జాగ్రత్త పడవలసి ఉంటుంది. స్థిరాస్తుల లావాదేవీలు జరుగగలవు. బ్యాంకుల నుండి ఋణాలు, ప్రభుత్వ అనుమతులు లభించగలవు. కొత్త వ్యాపారులకు అవకాశాలు కలసి రాగలవు. ప్రయాణ లక్ష్యాలు నెరవేరగలవు.

## ధనుస్సు



మూల, పూర్వాషాఢ, ఉ.షాఢ 1 పాదము

వ్యాపారాలలో స్తబ్ధత వల్ల కొత్త పథకాలను గూర్చి ఆలోచనలుంటాయి. ఆదాయం సామాన్యం. ప్రభుత్వం నుండి అనుమతులు ఆలస్యం కాగలవు. ఆర్థిక వ్యవ హారాలలో జాగ్రత్త అవసరం. స్థిరాస్తుల క్రయవిక్రయా లకు ఆటంకాలుంటాయి. అదనపు ఖర్చులు ఎక్కువుగా ఉండినా ప్రయోజనకరంగా ఉంటాయి. కోర్టు కేసులు వాయిదా పడటం, బాకీల వత్తిడి ఉంటుంది.

## మకరం



ఉ.షాఢ 2, 3, 4 పాదాలు, శ్రవణ, ధనిష్ఠ 1, 2 పాదాలు

మీ వ్యాపకాలు కార్యకలాపాలు పెరుగుతాయి. షేర్లు పెట్టుబడులు లాభదాయకాలు కాగలవు. విద్యార్థులకు ఉన్నత విద్యావకాశాలు అందుతాయి. స్థలాలు, పొలాలు, బాకీల వ్యవహారాలు పరిష్కారానికి వస్తాయి. వృత్తి వ్యాపారాలలో కొత్త అవకాశాలు దొరికి ఆదాయం పెరుగుతుంది. సోదర వర్గానికి మేలు చేకూరుతుంది. శుభకార్య భారాలు వహించడం జరుగుతుంది.

## కుంభం



ధనిష్ఠ 3, 4 పాదాలు, శతభిష, పూ.భాద్ర 1,2,3 పాదాలు.

ప్రముఖ వ్యక్తులతో పరిచయాలు, శుభకార్యముల నిర్ణయం కావడం, సకుటుంబ ప్రయాణాలుంటాయి. స్థిరాస్తుల అభివృద్ధి, క్రయవిక్రయాలు లాభాలనిస్తాయి. కుటుంబ వ్యక్తులకు కొద్దిపాటి విభేదాలుండి సర్దుబాటు కాగలవు. ఆరోగ్య విషయంలో శ్రద్ధ చూపండి. కొత్త వ్యాపారాలకు, పరిశ్రమలకు అవకాశాలు, అధికారుల అనుమతులు పొందుతారు.

## మీనం



పూర్వాభాద్ర 4 పాదం, ఉ.భాద్ర, రేవతి

వృత్తి వ్యాపారాలలో ఆదాయం పెరిగి అభివృద్ధి బాగుంటుంది. మీ ఆలోచనలు, పథకాలు అనుకున్నట్లుగా జరిగి, కార్యరూపం ధరిస్తాయి. కీలకమైన వ్యవహారా లలో మంచి నిర్ణయాలు తీసుకొంటారు. అయితే టెన్షన్ ఎక్కువుగా ఉంటుంది. బంధుమిత్రులను, ప్రముఖులను కలుసుకుంటారు. ఉద్యోగులకు అధికారుల సహకారం, ప్రోత్సాహకాలు పొందడం ఉంటుంది.

## కళ్యాణ వైభవం...!



నెల్లూరు రూరల్ పొట్టేపాళెం వాస్తవ్యులు పల్లంరెడ్డి సుప్రసాద్‌రెడ్డి - నీరజల కుమార్తె **సృజలారెడ్డి - సాయికృష్ణారెడ్డి** (చిట్టమూరు మండలం యల్లసిరి వాస్తవ్యులు పల్లంపర్తి సుబ్బారెడ్డి - సుగుణమ్మల కుమారుడు)ల కల్యాణం మార్చి 24వ తేదీ నెల్లూరులోని పివిఆర్ కళ్యాణ మండపంలో జరిగింది. నూతన వధూవరులకు'లాయర్' శుభాకాంక్షలు.



సీనియర్ పాత్రికేయులు కోలగట్ల సుధాకర్ - గిరిజల కుమార్తె **శ్రావణి - సత్యసాయిరాం** (విజయవాడ కానూరు వాస్తవ్యులు నిమ్మగడ్డ వెంకటేశ్వరరావు - స్వరూపరాణిల కుమారుడు)ల వివాహం మార్చి 26వ తేదీ నెల్లూరులోని టిటిడి కళ్యాణ మండపంలో జరిగింది. కొత్త జంటకు 'లాయర్' శుభాశీస్సులు.

## కావలి పిఆర్ యూనిట్ ఎన్నిక ఏకగ్రీవం

ఆంధ్రప్రదేశ్ పంచాయితీరాజ్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో కావలి తాలూకా యూనిట్ ఎన్నికలు మార్చి 30వ తేదీన కావలి మండల ప్రజాపరిషత్ సమావేశ మందిరం నందు జరిగాయి. కావలి తాలూకా అధ్యక్షులుగా ఎన్.వెంకటేశ్వర్లు, కార్యదర్శిగా ఎ.వి.సుబ్బారావు, ఉపాధ్యక్షులుగా పి.మురళీకృష్ణ, సంయుక్త కార్యదర్శిగా బి.సుకన్య, కోశాధికారిగా సిహెచ్ శ్రీదేవి, డిస్ట్రిక్ కౌన్సిలర్స్‌గా ఎస్.కె.ఫిరోజ్, బి.వి.నాగరాజులను ఎన్నుకున్నట్లు ఉద్యోగుల సంఘం రాష్ట్ర కార్యనిర్వహణ సభ్యులు లక్కాకుల పెంచలయ్య ఒక ప్రకటనలో తెలియజేశాడు.

## ఆనం సమక్షంలో 'దేశం'లో చేరిక



మార్చి 29వ తారీఖున నెల్లూరులోని పొదలకూరురోడ్డుకు చెందిన 200మంది కుర్రోళ్లు వివిధ పార్టీల నుండి వచ్చి మాజీఎమ్మెల్యే ఆనం వివేకానందరెడ్డి సమక్షంలో తెలుగుదేశంపార్టీలో చేరారు. స్థానిక నాయకులు మస్తాన్‌రెడ్డి ఆధ్వర్యంలో బర్నాబాస్ సహకారంతో వీరంతా ఏసి సెంటర్‌లో వివేకా చేతుల మీదుగా మెడలో పసుపు కండువాలు వేయించుకున్నారు. ఈ సందర్భంగా వివేకా మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం రోజున ఇంతమంది చేరడం పార్టీకి శుభసూచకమన్నారు. చంద్రబాబు పాలన పట్ల యువత ఆకర్షితులవుతున్నారని, ఆయనను యూత్ ఐకాన్‌గా అభివర్ణించారు. కార్పొరేటర్ ఆనం రంగమయూర్‌రెడ్డి మాట్లాడుతూ మీతో కలవడానికి, మీతో పలకడానికి, మీతో కలసి నడవడానికి ఆనం కుటుంబసభ్యులు ఎప్పుడూ సిద్ధంగా ఉంటారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఇంకా శివ, ఉదయ్, సాయిప్రసాద్, వెంకటేశ్వర్లు, హరి, అమరుల్లా, కళ్యాణ్, చిన్న, నాని, అబిద్, సాగర్, వేణు తదితరులు పాల్గొన్నారు.



## కావలి కబుర్లు

## అల్లూరు మండల కార్యాలయానికి నిధులు



మండల వ్యవస్థ ఏర్పడినప్పటి నుండి అల్లూరు మండల రెవెన్యూ కార్యాలయానికి సొంత భవనం లేక అద్దె భవనంలో పరిపాలన సాగిస్తున్నారు. అయితే తాజాగా కావలి మాజీఎమ్మెల్యే, రాజధాని నిర్మాణకమిటి సభ్యులు బీద మస్తాన్‌రావు కృషితో నూతన మండల రెవెన్యూ కార్యాలయ భవన నిర్మాణానికి 86లక్షల రూపాయలు ప్రభుత్వం మంజూరు చేసింది. త్వరలో టెండర్లు పిలిచి, ఈ కార్యాలయ పనులు ప్రారంభిస్తారని బీద మస్తాన్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు.

### కావలిలో కొత్తగా

## హోటల్ విజయదుర్గ

**ప్రారంభించిన ఎమ్మెల్యే**

కావలి ట్రంకురోడ్డులో ఎల్ఐసి బిల్డింగ్ ఎదురుగా నూతనంగా నిర్మించిన విజయదుర్గా ఏసి ఫ్యామిలి రెస్టారెంట్‌ను మార్చి 30వ తేదీ కావలి శాసనసభ్యులు రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి ప్రారంభించారు. వైకాపా జిల్లా ప్రధానకార్యదర్శి మన్నెమాల సుకుమార్‌రెడ్డి సారథ్యంలో ఈ హోటల్ నిర్వహించబడుతుంది. వ్యాపారంలో దినదిన ప్రవర్ధమానం కావాలని ఎమ్మెల్యే ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.



## మహిళలు పారిశ్రామిక రంగంలో రాణించాలి



సమాజంలో మహిళలు పారిశ్రామికవేత్తలుగా రాణించాలని చైనాలో భారత రాయబారిగా పని చేస్తున్న డాక్టర్ బాలభాస్కర్ సతీమణి కవిత పేర్కొన్నారు. మార్చి 25వ తేదీన కావలి పట్టణంలోని పాతవూరులో ఫ్రెండ్స్ ఆర్గనైజేషన్ వారి ఆధ్వర్యంలో కేంద్ర జౌళిశాఖ సహకారంతో నిర్వహించిన ఉచిత మహిళా కుట్టు శిక్షణ పూర్తి చేసిన వారికి సర్టిఫికేట్లు అందజేసే కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జూకీ మిషన్ల ద్వారా మహిళలు శిక్షణ పొంది ఉపాధి గడించాలన్నారు. మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదిగితే బ్యాంకుల ద్వారా ఋణ సదుపాయం పొందే అవకాశం వుందని ఆమె పేర్కొన్నారు. ఈ సభలో డాక్టర్ కవితాభాస్కర్‌ను ఆ ఆర్గనైజేషన్ వారు శాలువా, పూలమాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటి సభ్యులు ముడిగండ్ల మాలకొండారెడ్డి, ట్రైనర్ రమాదేవి, మల్లిక, ఏ.రామచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మెగా రక్తదాన శిబిరం



మెగాస్టార్ చిరంజీవి కుమారుడు రామ్‌చరణ్ తేజ పుట్టినరోజు సందర్భంగా కావలి రెడ్‌క్రాస్ భవన్‌లోని బ్లడ్‌బ్యాంక్‌లో అభిమానులు భారీ రక్తదాన శిబిరం నిర్వహించారు. కావలి డిఎస్పీ రాఘవరావు, డాక్టర్ సిఎల్ఎన్ రెడ్డి, బ్లడ్‌బ్యాంక్ మెడికల్ ఆఫీసర్ బి.రవికుమార్‌లు జ్యోతి ప్రజ్వలన చేసి రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. అఖిలభారత చిరంజీవి యువత ప్రధానకార్యదర్శి చింతాల వెంకట్రావు కేక్‌ను కట్ చేసి అందరికీ పంచిపెట్టాడు. ఈ కార్యక్రమంలో గంధం ప్రసన్నాంజనేయులు, తన్నీరు మాల్యాద్రి, సుధీర్‌నాయుడు, రవిప్రకాష్, ఓరుగంటి వెంకటేశ్వర్లు, గోవిందరెడ్డి తదితరులు పాల్గొన్నారు. చిరంజీవి అభిమానులు పెద్దఎత్తున రక్తదానం చేశారు.

## హత్యకేసు నిందితుల పట్టివేత



కావలి పట్టణంలో ఉపాధ్యాయ కాలనీకి చెందిన తాడికొండ ఆదెమ్మ హత్యకేసులో నిందితులను అరెస్ట్ చేసినట్లు కావలి డిఎస్పీ రాఘవరావు తెలిపారు. ఆదివారం కావలి టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆదెమ్మను అతిదారుణంగా ఇనుపరాడ్లతో కొట్టి చంపారని, ఈ కేసులో ప్రకాశం జిల్లా గుడ్లూరు మండలం రావూరుకు చెందిన కాకు మల్లిఖార్జున, వెంకట్రావులను అరెస్ట్ చేసినట్లు చెప్పారు. ఈ కేసును ఛేదించడంలో కృషిచేసిన రెండవ పట్టణ సిఐ ఎం.మధుబాబు, ఎస్ఐ అన్వర్‌బాషా, ఏఎస్ఐ మహేంద్ర, సిబ్బంది గౌస్, రమేష్, వెంకయ్య, సత్యం, అనిల్‌కుమార్, వినోద్‌కుమార్‌లను ఆయన అభినందించారు.

# దువ్వూరోడి పవర్

(2వ పేజీ తరువాయి)





**మేకిన్ ఇండియా స్ఫూర్తితో...** గల్ఫ్ దేశాలలో నెల్లూరు సత్తా చాటుతున్న కిషోర్‌లో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఇచ్చిన "మేకిన్ ఇండియా" పిలుపు ఉత్సాహం రేకెత్తించింది. తన సొంత జిల్లాలోని ప్రసిద్ధ పారిశ్రామికవాడ శ్రీసిటీలోనూ తమ కంపెనీని విస్తరించాలని భావిస్తున్నాడు. ఈమేరకు శ్రీసిటీ యం.డి రవీంద్ర సన్నారెడ్డితోనూ చర్చలు జరిపాడు.

**ప్రతిభకు పురస్కారాలు:** విద్యుత్ కేంద్రాల నిర్మాణంలో చేసిన కృషికి, యువతకు ఉద్యోగాల కల్పనలో ఆయన సాధించిన ప్రగతికి పలు పురస్కారాలందుకున్నారు. అబుదాబి తెలుగు అసోసియేషన్ వారు ఎమర్జింగ్ యంగ్ ఎంటర్‌ప్రెనర్ అవార్డును బహూకరించారు. 2014లో యూనైటెడ్ అరబ్ ఎమిరేట్స్ తెలుగు అసోసియేషన్ వారు ప్రవాసమిత్ర అవార్డును, రసమయి సాహిత్య సంస్థ వారు 'ప్రవాస బంధు' పురస్కారాన్ని ప్రదానం చేశారు. ఈ యేడాది ఏప్రిల్ 8న తెలుగు స్రవంతి ఉగాది పురస్కారాన్ని ఆయనకు ప్రదానం చేయనున్నారు.

**సామాజిక సేవ:** చిన్నతనం నుండే సామాజిక స్పృహను వంట బట్టించుకున్న కిషోర్ తన గ్రామాభివృద్ధికి విశేష కృషి చేస్తున్నారు. నెలలో ఒకరోజు స్వగ్రామమైన దువ్వూరు వెళతారు. తాను చదివిన పాఠశాలలో వసతులు కల్పించారు. అక్కడ విద్యార్థులకు కావాల్సిన సౌకర్యాలను సమకూరుస్తున్నారు. ఆ గ్రామంలో తన సొంత నిధులతో ఆసుపత్రిని కట్టించాలని భావిస్తున్నారు. ఈమేరకు అనుమతుల కోసం, నిర్వహణ కోసం మున్సిపల్ మంత్రి పి.నారాయణతో కూడా చర్చించారు. సొంతూరు దువ్వూరు అభివృద్ధి కోసం ఆ గ్రామాన్ని దత్తత తీసుకోవాలనే ఆలోచనలో కూడా ఆయనున్నాడు.

కిషోర్‌బాబు విజయాలలో ఆయన సతీమణి దీపికబాబా పాత్ర కూడా వుందని చెప్పొచ్చు. ఎలక్ట్రికల్ బిటెక్ పూర్తి చేసిన ఆమె జజీరా ఎమిరేట్స్ పవర్ కంపెనీ నిర్మాణాలలో పాలుపంచుకుంటున్నారు. అల్లూరు మండలం గొల్లపాలెంలోని ఆశ్రమం అభివృద్ధికి ఆమె తనవంతు సహకారం అందిస్తున్నారు.

ఒక మనిషి పుట్టాక తనకు తన కుటుంబానికి మాత్రమే ఉపయోగపడితే ఆ జీవితానికి అర్థం లేదు. అదే పుట్టుక కొన్ని వందల, వేల మందికి దారి చూపితే అర్థవంతమైన జీవితానికి పరమార్థం అదే! కిషోర్‌బాబు ఇన్ని విజయాలు సాధించింది విద్యుత్ రంగంలో అయినా అతనిని బల్బుతో పోల్చలేం. అతను దీపం లాంటి వాడు. ఒక బల్బుతో ఇంకో బల్బును వెలిగించలేము. కాని ఒక దీపంతో ఎన్నో వేలు, లక్షల దీపాలైనా వెలిగించొచ్చు. కిషోర్ అనే ఈ దీపమే తన ఎలక్ట్రికల్ రంగంలో ఎన్నో వేల దీపాలను వెలిగించగలిగింది. దుబాయ్‌లో నెల్లూరు పవర్ చూపిన కిషోర్‌కు హేట్సాఫ్!

# సమాజం వెన్నుతట్టే సాహిత్యం కావాలి



నెల్లూరుసీమ నాటి తిక్కన నుంచి నేటి తిక్కవరపు పట్టాభిరామిరెడ్డి వరకు ఎందరో కవుల్ని, సాహితీవేత్తల్ని, రచయితల్ని అందించిందని, వారి వారసత్వంగా ఎందరో కవులు, రచయితలు వచ్చి సమాజానికి వెన్నుతట్టే సాహిత్యం అందించాలని ఆంధ్రజ్యోతి ప్రధాన సంపాదకుడు డాక్టర్ కె.శ్రీనివాస్ కోరారు. బుధవారం నెల్లూరు ట్రంకురోడ్డు టివియస్ కళ్యాణసదన్‌లో కవి ఈతకోట సుబ్బారావు రచించిన 'కాకిముద్ద' కవితా సంకలనాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత పరాయి సంస్కృతుల వైపు ఆకర్షణకు గురై దేశానికి పనికిరాని కాకి ముద్దలు కావద్దని ఉద్బోధించారు. కాకి ముద్ద కవితా సంకలనంలో కవి సంస్కృతి, పల్లెలు, మానవీయత, దేశమే పరాదీనం కావడం పట్ల ఆతృతలు కనబరుస్తూ నేటి కాలపు కవితల్ని వ్రాసినందుకు అభినందించారు. శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా రచయితల సంఘం అధ్యక్షులు చిన్ని నారాయణరావు అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో సంఘం గౌరవాధ్యక్షుడు డా॥ ఈదూరు సుధాకర్ కాకిముద్ద కవితా సంకలనం పుస్తకాన్ని సమీక్షించి కవి భావాల్ని విశ్లేషించారు. అనంతరం కె.శ్రీనివాస్‌ను సంఘ కార్యవర్గం సత్కరించింది. పుస్తక రచయిత ఈతకోట సుబ్బారావును రచయితల సంఘం తరపున ఆంధ్రజ్యోతి ప్రధాన సంపాదకులు, అసోసియేట్ సంపాదకులు డాక్టర్ కె.శ్రీనివాస్, ఉమామహేశ్వరరావు, చిన్ని నారాయణరావు, డాక్టర్ ఈదూరు సుధాకర్ తదితరులు సన్మానించి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సాహితీవేత్తలు, కవులు, కళాకారులు, అభిమానులు, పురప్రముఖులు పాల్గొన్నారు.

# జీతాలు పెంచుకున్నారు

(మొదటి పేజీ తరువాయి)

ఇక పలు అంశాల విషయంలో పరస్పరం దూషించుకునే అధికార, విపక్ష సభ్యులు జీతాల బిల్లు విషయంలో మాత్రం ఏక తాటిపై నిలిచారు. వైకాపాకు చెందిన ఒకే ఒక సభ్యుడు, నెల్లూరు గ్రామీణ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి మాత్రం దీనిని వ్యతిరేకించాడు. ఆయన నాయకుడు వై.యస్. జగన్మోహన్‌రెడ్డి జీతాల పెంపును తగ్గించాలని సూచించారే గాని వ్యతిరేకించలేదు. కాని కోటంరెడ్డి కుండబద్ధలు కొట్టినట్లు వ్యతిరేకించాడు. నెలకు రూపాయి జీతం తీసుకున్న స్వర్గీయ నందమూరి తారక రామారావు స్థాపించిన పార్టీ మీది. ఆయనను ఆదర్శంగా తీసుకుందాం. 1978లో రాష్ట్రంలో గూడు, నీడ లేని పేదలకు ఇళ్ళ స్థలాలివ్వకుండా, శాసన సభ్యులకు ఇళ్ళ స్థలాలివ్వడాన్ని ఆనాటి సభలో స్వర్గీయ పుచ్చలపల్లి సుందరయ్య తీవ్రంగా వ్యతిరేకించారు. పేదల కడుపు కొట్టి తమ స్వార్థం చూసుకున్న ఆనాటి ప్రభుత్వానికి ఏ గతి పట్టిందో మీకు తెలుసు... ఇక్కడ పూటకు గతిలేని పేదలెవరూ లేరని అన్నాడు. అంతేకాదు, రాష్ట్రంలోని 175నియోజకవర్గాలలో ప్రజాభిప్రాయ సేకరణ జరిపి, ఏ ఒక్క నియోజకవర్గంలో ప్రజలు ఎమ్మెల్యేల జీతాల పెంపును సమర్థిస్తే తాను రాజీనామా చేస్తానని ఆయన సవాల్ విసిరారు. నిజంగా ఈ ఛాలెంజ్‌ను ప్రభుత్వం స్వీకరించ లేదు. ఎందుకంటే రాజకీయ నాయకులంటేనే ప్రజల్లో ఒక అసహనం వుంటుంది. ఇప్పుడు తమ పాటికి తాము జీతాలను పెంచుకున్న ఎమ్మెల్యేలను చూస్తే ప్రజలకు ఇంకా అసహ్యం వేస్తుంది.

అసలు రాష్ట్ర విభజన తర్వాత ప్రభుత్వం చెప్పిందేమిటి, చేస్తున్నదేమిటి? విభజన వల్ల రాష్ట్రంలో ఆర్థిక లోటు ఏర్పడింది. ఉద్యోగుల జీతాలకు డబ్బులు లేని పరిస్థితి. ఇక రాజధాని లేక కట్టు బట్టలతో నడిరోడ్డు మీద నిలబడ్డాం. రాష్ట్రాన్ని ఆర్థికంగా నిలబెట్టుకోవడానికి ప్రజలు త్యాగాలు చేయాలని పాలకులు చెప్పారు. నవ్యాంధ్ర రాజధాని నిర్మాణమంటూ స్కూల్ పిల్లలను మొదలుకొని ప్రవాసభారతీయుల వరకు ఎవరినీ వదలకుండా విరాళాలు రాబట్టారు. రాజధాని ఉద్యోగులను వచ్చి టెంట్‌లు వేసుకుని పని చేయమంటున్నారు. రాజధాని కోసం భూములు సేకరించిన రైతులకు రూపాయి పరిహారం ఇవ్వలేదు. నవ్యాంధ్ర రాజధాని నిర్మాణంలో వారిని కూడా త్యాగమూర్తులుగా మార్చారు.

మరి ఆర్థిక ఇబ్బందుల్లో వున్న రాష్ట్రం కోసం సామాన్య ప్రజలు, సాధారణ ఉద్యోగులు ఇన్ని త్యాగాలు చేస్తుంటే, అన్ని రకాలుగా ప్రభుత్వ సౌకర్యాలను అనుభవించే ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు తమ జీతాల పెంపును త్యాగం చేయలేరా? సభ్యుల జీతాల పెంపు ద్వారా రాష్ట్ర ప్రభుత్వంపై ఎంత ఆర్థిక భారం పడుతుందనేది వేరే సంగతి. కాని సభ్యులకు ఇప్పుడొచ్చే జీతాలేం తిండి గింజలకు కూడా సరిపోనంతగా ఏం లేవు. ఒక సీనియర్ ఉన్నతాధికారికి ఎంత జీతమొస్తుందో... వీరికి ఆ స్థాయిలో వస్తుంది. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని దృష్టిలో పెట్టుకుని సభ్యులు కూడా జీతాల పెంపును ఆ కోణంలో వ్యతిరేకించి వుంటే స్ఫూర్తివంతంగా వుండేది. ప్రజలను త్యాగాలు చేయమని అడగడానికి అర్హత, అవకాశముండేది.

# అహో బాహుబలి

(మొదటి పేజీ తరువాయి)

ప్రపంచ దేశాల ప్రేక్షకులను మెప్పించే సినిమాలు తీయగల దర్శకులు మా వద్ద వున్నారని. ఒక సంవత్సరమా... రెండు సంవత్సరాలా... లేక రెండు దశాబ్దాలా... ఏకంగా 63సంవత్సరాలు. ఒక తెలుగు సినిమా జాతీయ ఉత్తమ చిత్రంగా ఎంపిక కావడానికి పట్టిన సమయమిది. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన ఈ ఏడు దశాబ్దాలలో దేశాన్ని ఒకే కుటుంబం ఎక్కువ కాలం పరిపాలించినా, ఈ ఏడు దశాబ్దాలలో ఒక తెలుగోడు పి.వి.నరసింహారావు రూపంలో ప్రధాని కాగలిగాడు. కాని ఒక తెలుగుసినిమాకు జాతీయ పురస్కారం రావడానికి ఇన్నేళ్లా? ఇది ఆశ్చర్యకరమే. అయితే ఆ రికార్డును బ్రేక్ చేస్తూ ఒక అద్భుతం చోటుచేసుకుంది. ఓ తెలుగు దర్శకుడు టాలీవుడ్, బాలీవుడ్‌లను తలదన్ని హాలీవుడ్ స్థాయిలో నిర్మించిన 'బాహుబలి' తెలుగు సినిమాకు తొలి సారిగా జాతీయ పురస్కారం లభించింది. ఇది తెలుగు సినిమాకు దక్కిన గౌరవం. తెలుగు దర్శకుడి ప్రతిభకు, తెలుగు నటుల నటనా పటిమకు, తెలుగు సాంకేతిక నిపుణుల నైపుణ్యానికి దక్కిన సత్కారం. 80ఏళ్ల తెలుగు సినీ చరిత్రలో ఓ తెలుగు సినిమాకు జరిగిన పట్టాభిషేకం. తెలుగు సినిమా సత్తాను ప్రపంచానికి చాటిన దర్శకుడు ఎస్.ఎస్.రాజమౌళి కఠోరశ్రమకు, అతని టీంకు దక్కిన అపురూప సత్కారమిది.

అలాగే మరో తెలుగు సినిమా 'కంచె' ఉత్తమ ప్రాంతీయ చిత్రంగా ఎంపిక కావడం తెలుగు సినీ జగత్తుకే గర్వకారణం. గమ్యం, వేదం వంటి సందేశాత్మక చిత్రాల దర్శకుడు క్రిష్ దర్శకత్వంలో రూపు దిద్దుకున్న 'కంచె' రెండో ప్రపంచ యుద్ధం కాలం నాటి ప్రేమ కథతో సాగుతుంది. కులం కంచెలను చెరిపేలా రూపొందించిన ప్రేమకథా చిత్రానికి నాడు విమర్శకుల ప్రశంసలు అందగా, నేడు జాతీయ స్థాయి ప్రశంసలందాయి.

63ఏళ్లుగా జాతీయ స్థాయి ఉత్తమ చిత్రాలుగా వివిధ భాషా చిత్రాలు ఎంపికవుతూనే వున్నాయి. దేశంలో సినిమాల నిర్మాణంలో గాని, ఖర్చులో గాని సెట్టింగ్‌లలో గాని బాలీవుడ్ తర్వాత స్థానం టాలీవుడ్‌దే! కాని జాతీయ అవార్డులలో సింహభాగం బాలీవుడ్‌కే దక్కేది. ఇక ఇతర భాషా చిత్రాలు కూడా అప్పుడప్పుడు ఉత్తమ జాతీయ చిత్రాలుగా ఎంపికయ్యాయి. తెలుగు సినిమా వాళ్లకు మాత్రం వ్యక్తిగత చిల్లర అవార్డులు లభించేవి. తెలుగు సినిమాకు ఒక్కసారన్నా జాతీయ పురస్కారం లభించాలన్న సుదీర్ఘ స్వప్నం రాజమౌళి 'బాహుబలి'తో సాకారమైంది. మూడేళ్ల జక్కన కృషికి ఫలితం ఈ అవార్డు. బాహుబలి సినిమా కలెక్షన్‌ల పరంగా వందల కోట్లు సాధించి ఉండొచ్చు. ఆ వందల కోట్లన్నీ ఒకెత్తయితే ఈ జాతీయ పురస్కారం మరో ఎత్తు. దీనిని ఎన్ని వందల కోట్లతోనూ తూచ లేరు.

తెలుగు సినీ పరిశ్రమలో ఎందరో దర్శక దిగ్గజాలున్నారు. చేయి తిరిగిన రచయితలున్నారు. ఎంత ఖర్చుకైనా వెనుకాడని నిర్మాతలున్నారు. వారందరికీ అసాధ్యమైంది రాజమౌళికి సుసాధ్యమైంది. ఇటీవల తెలుగు సినిమాల ట్రెండ్ ఏ విధంగా వుందో చూస్తున్నాం. ఆరు పాటలు, వాటిలో ఒకటి ఐటమ్ సాంగ్, నాలుగు ఫైట్లు, సినిమా అంతా కుళ్ళు జోకులు... స్పెషల్‌గా బ్రహ్మానందం క్యారెక్టర్... హిట్టయిన ఓ నాలుగు సినిమాలను గ్రైండర్‌లో వేసి రుబ్బి ఓ సినిమా తీయడం తెలుగు దర్శకులకు అలవాటుగా మారింది. ఇలాంటి ట్రెండ్‌ను ఫాలో అవకుండా రాజమౌళి బాహుబలి ద్వారా సరికొత్త ప్రయోగానికి శ్రీకారం చుట్టారు. ఓ జానపద కథతో ప్రయోగం చేశారు. ప్రభాస్, రానా, రమ్యకృష్ణ, నాజర్, తమన్నా, ప్రభాకర్... బాహుబలికి ప్రాణం పోసిన తారాగణం. గ్రాఫిక్స్‌తో పెద్ద మాయా ప్రపంచవే సృష్టించారు. ప్రపంచంలో వందలకోట్లు కలెక్షన్‌లు కొల్లగొట్టిన హాలీవుడ్ సినిమాలను తలదన్నే రీతిలో బాహుబలిని జక్కన చెక్కారు. అతని శ్రమ ఊరికే పోలేదు. నిన్న కలెక్షన్‌ల రూపంలో... నేడు జాతీయ పురస్కార రూపంలో... "శ్రమయేవ జయతే" అన్న సూక్తికి అక్షరసత్యం రాజమౌళి... బాహుబలి.


## ఇందుకూరుపేట బిట్-1 గ్రామ పంచాయితీ కార్యాలయము

ఆర్.ఓ.సి.నెం.17/టెండర్స్/2016 తేది.22.03.2016

### టెండరు నోటీసు

శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరుజిల్లా, ఇందుకూరుపేట మండలము ఇందుకూరుపేట బిట్-1 గ్రామ పంచాయితీకి అవసరమైన ఈ క్రింది వస్తువులు 2016-17 సంవత్సరముకు సరఫరా చేయుటకు గాను ఇందుకూరుపేట బిట్-1 గ్రామ పంచాయితీ కార్యాలయము నందు పంచాయితీ కార్యదర్శి గారిచే గాని, లేదా వారి అనుమతి పొందిన వారిచే గాని సీల్డు టెండర్లు తేది. 12-04-2016 ఉదయం 11గం.ల నుండి మధ్యాహ్నము 1.00గం.ల వరకు స్వీకరించబడును. మరియు అదేరోజు మధ్యాహ్నము గం. 3.00 గం.లకు హాజరైన టెండరుదారుల సమక్షములో సీల్డు టెండర్లు తెరువబడును. టెండర్లు దాఖలు చేయువారు ఈ క్రింద తెలిపిన విధముగా ధరావత్తు చెల్లించి టెండర్ల యందు పాల్గొనవచ్చును. ధరావత్తు చెల్లించని టెండర్లు అంగీకరించబడవు. టెండరుదారులు స్వంత ఖర్చుతో గ్రామ పంచాయితీకి వస్తువులు చేర్చవలెను.

| వ.నెం. | వివరములు | ధరావత్తు రూ. |
|---|---|---|
| 1. | వీధి విద్యుత్‌శ్చక్తి దీపముల విడిభాగములు మరియు ఫిక్సర్లు సరఫరా చేయుట (శ్రీయుత జిల్లా కలెక్టరు (పం.వి) నెల్లూరు వారి ఉత్తర్వులలో అనుమతి పొందిన ఆథరైజ్డ్ డీలర్లు మాత్రమే) | 500.00 |
| 2. | ప్రజారోగ్య పారిశుద్ధ్య సామానులు, సున్నము, బ్లీచింగ్‌పౌడరు, ఫినాయిల్ వగైరా ధఫాల వారీగా సరఫరా చేయుట | 200.00 |
| 3. | పి.డబ్ల్యు.ఎస్. సామానులు దఫాల వారీగా సరఫరా చేయుట | 200.00 |
| 4. | స్టేషనరీ సరఫరా చేయుట | 200.00 |
| 5. | ఎల్.యఫ్.ఫారములు మరియు పుస్తకములు వగైరా సరఫరా చేయుట | 200.00 |
| 6. | పంచాయతి సిబ్బందికి యూనిఫారమ్‌లు సప్లయి చేయుటకు | 200.00 |

గమనిక: పై టెండర్లు ఆమోదము తెలుపుటకు తుది నిర్ణయము పంచాయితీ వారిది. టెండరు తేది నాడు ప్రభుత్వము వారు సెలవు దినముగా ప్రకటించిన యెడల మరుసటి రోజు నిర్ణీత సమయములో స్వీకరించబడును.

సం/- పి.మల్లికార్జున రావు
పంచాయతీ కార్యదర్శి, ఇందుకూరుపేట బిట్-1
శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరుజిల్లా.

# భారత్ టు బంగ్లా...

- నౌకా వాణిజ్యంలో కొత్త చరిత్ర
- చారిత్రక ఒప్పందం అమలుకు వేదికైన కృష్ణపట్నం



కృష్ణపట్నం పోర్టు... నవ్యాంధ్ర పారిశ్రామిక రంగానికి తలకాయ అయితే, నెల్లూరుజిల్లా అభివృద్ధికి గుండెకాయ. దేశ పారిశ్రామిక ప్రగతిలోను, విదేశీ నౌకా వాణిజ్యంలోనూ ఈరోజు కృష్ణపట్నం పోర్టుదే కీలకపాత్ర. అంతర్జాతీయ ప్రమాణాలతో నెలకొల్పిన కృష్ణపట్నం పోర్టు మరో చారిత్రాత్మక ఒప్పందానికి వేదికగా నిలిచింది. 42ఏళ్ల క్రితం ప్రధానిగా ఇందిరాగాంధీ హయాంలో భారత్ - బంగ్లాదేశ్‌ల మధ్య కుదిరిన వాణిజ్య ఒప్పందాన్ని ఈరోజు కృష్ణపట్నం పోర్టు ద్వారా అమలులోకి తెచ్చారు. ఇటీవల బంగ్లాదేశ్‌లో పర్యటించిన ప్రధాని నరేంద్ర మోడీ ఆనాటి ఒప్పందాన్ని పునరుద్ధాటించారు. ఈమేరకు ఇరు దేశాల మధ్య వాణిజ్య సంబంధాల శుభప్రారంభం కృష్ణపట్నం నుండే జరిగింది. బంగ్లాదేశ్ నుండి కృష్ణపట్నం పోర్టుకు వచ్చిన ఎం.వి. హార్బర్-1 అనే నౌక సరకులు నింపుకుని మార్చి 28వ తేదీన ఆ దేశానికి తిరుగు పయనమైంది. ఈ నౌక వీడ్కోలు కార్యక్రమాన్ని పోర్టులో వైభవంగా నిర్వహించారు. నెల్లూరుజిల్లా కలెక్టర్ శ్రీమతి యం.జానకి, బంగ్లాదేశ్ పార్లమెంట్ సభ్యులు ఖార్ ఇ ఆలం చౌదరి, యండి నసీర్‌అహ్మద్ చౌదరి, వ్యాపారప్రతినిధి భాషామియా, బంగ్లాదేశ్‌లోని పంగాం పోర్టు సిఇఓ యం.డి.సిరాజ్‌రెహ్మాన్, కృష్ణపట్నం పోర్టు సిఇఓ ఎండ్లూరి అనిల్, సుబ్బారావు, పిఆర్ఓ హెడ్ వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

ఇప్పటివరకు బంగ్లాదేశ్‌కు భారత్ నుండి నేరుగా నౌకల ద్వారా సరకు రవాణా లేదు. మొదట సింగపూర్ లేదా శ్రీలంకలకు తరలించి అక్కడ నుండి బంగ్లాదేశ్‌కు పంపిస్తున్నారు. దీనివల్ల భారత్ నుండి సరుకులు బంగ్లాదేశ్‌కు చేరాలంటే వారం రోజులు పట్టేది. ఇప్పుడు భారత్ నుండి ఈశాన్య రాష్ట్రాల మీదుగా నేరుగా నౌకలు బంగ్లాదేశ్‌కే వెళ్లనున్నాయి. దీనివల్ల రెండు నుండి ఐదురోజుల్లోపే సరుకులు బంగ్లాదేశ్‌కు చేరనున్నాయి. బంగ్లాదేశ్‌లో వస్త్ర పరిశ్రమలెక్కువ. ఆంధ్రప్రదేశ్‌లో వస్త్ర పరిశ్రమ ముడిసరుకైన పత్తి దిగుబడి ఎక్కువ. కాబట్టి కృష్ణపట్నం పోర్టు నుండి బంగ్లాదేశ్‌కు ఇక పత్తి ఎగుమతులు పెరుగనున్నాయి. కృష్ణపట్నం పోర్టు చరిత్రలో ఇది ఒక సువర్ణ అధ్యాయమే. ఏపి నుండి వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతికి ఈ ప్రక్రియ ఎంతో దోహదపడుతుంది. వాణిజ్య రవాణాలో ఓ చారిత్రాత్మక మైలురాయిని దాటిన కృష్ణపట్నం పోర్టు యాజమాన్యానికి 'లాయర్' అభినందనలు.

# అన్నదాతను ఆదుకోండి

- సీఎంను కలిసి విన్నవించిన జిల్లా దేశం నేతలు



తెలుగు రాష్ట్రాల్లో ఏ జిల్లాలోనూ లేని విధంగా నెల్లూరుజిల్లాలో రికార్డు స్థాయిలో 30లక్షల టన్నుల ధాన్యం దిగుబడి అయ్యిందని, రైతులకు గిట్టుబాటు ధరలు లభించేలా చర్యలు తీసుకోవాలని నెల్లూరుజిల్లా ఎమ్మెల్సీలైన సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, మాగుంట శ్రీనివాసులురెడ్డి, వాకాటి నారాయణరెడ్డి, బీద రవిచంద్రలు బుధవారం హైదరాబాద్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసి విజ్ఞప్తిచేశారు. మా జిల్లా రైతులు కష్టపడి ధాన్యం పండించారు. మద్దతు ధర లేక ఇబ్బందులు పడుతున్నారు. పండిన ధాన్యాన్ని ఇతర రాష్ట్రాల్లో అమ్ముకోవడానికి, పక్క రాష్ట్రాల వాళ్లొచ్చి ఇక్కడ కొనుగోలు చేయడానికి అనేక ఆంక్షలున్నాయి. వాటిని ఎత్తేస్తే రైతులకు గిట్టుబాటు ధరలొచ్చి, నాలుగు రూపాయలొస్తాయని, వారు సంతోషపడతారని మనోళ్ళు సీఎంకు వివరించారు. ఈ విషయంపై సీఎం సానుకూలంగా స్పందించి అన్నదాతలకు అంతా మంచే జరిగేలా చూస్తానని హామీ ఇచ్చారు.

### చదువులపై...

# సర్కార్‌ను ఎండగట్టిన అనిల్



నెల్లూరు నగర ఎమ్మెల్యే పి.అనిల్‌కుమార్‌యాదవ్ ఓ మంచి సబ్జెక్ట్‌పై అసెంబ్లీలో ప్రభుత్వాన్ని ఎండగట్టారు. సర్కారీ చదువులు ఏ విధంగా తగలబడుతున్నాయనే విషయాన్ని అతను సభ దృష్టికి తెచ్చాడు. కార్పొరేట్ విద్య మాయలో సర్కార్ చదువులు చతికిలబడుతున్నాయి. విశాలమైన గదులు, క్రీడామైదానాలు, అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులున్నా కూడా ప్రభుత్వ బడుల్లో పిల్లలు చేరడం లేదు. అగ్గిపెట్టెల్లాంటి గదులు, అయిదారంతస్థుల మేడలున్న కార్పొరేట్ స్కూళ్లలో వేలు, లక్షలు పోసి పిల్లలను చదివిస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు లేకపోవడంతో ఏ గతీలేని పేదవాళ్లు తప్పితే మధ్యతరగతి ప్రజలు కూడా తమ పిల్లలను ప్రభుత్వ బడులకు పంపడం లేదని అనిల్ ధ్వజమెత్తారు. పంచాయితీ కార్యదర్శి నుండి ముఖ్యమంత్రి వరకు, గుమస్తా నుండి ఐఏఎస్ అధికారి వరకు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చదివించే ధైర్యం చేయగలరా? అని ఆయన ప్రశ్నించారు. స్వాతంత్ర్యం వచ్చిన ఇన్నేళ్లకు కూడా ప్రభుత్వ పాఠశాలల్లో వసతులు కల్పించలేక పోవడం సిగ్గుచేటన్నారు. గత 20ఏళ్లుగా ప్రతి ఏడాది లక్ష మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల నుండి ప్రైవేట్ పాఠశాలలకు పోతున్నారు. నెల్లూరులోని 700మంది బాలికలు చదివే ఓ ప్రభుత్వ స్కూల్‌లో కనీసం మరుగుదొడ్లు కూడా లేవు. ఇలా వుంటే సర్కార్ బడుల్లో చదువులెలా సాగుతాయని అనిల్ ప్రశ్నించాడు. ప్రభుత్వ పాఠశాలల్లో వసతులు కల్పించి, కొత్త కోర్సులు ప్రవేశపెట్టి, ఉపాధ్యాయుల చేత నాణ్యమైన విద్యను అందించినప్పుడే ప్రభుత్వ బడులు బాగుపడతాయని ఆయన పేర్కొన్నాడు.

- రసవత్తరంగా నగరపాలక సంస్థ బడ్జెట్ సమావేశం

# స్వపక్షమే విపక్షమై...



**స్వపక్షం లేదు... విపక్షం లేదు.. అధికార పక్షంలోనే కొందరు ప్రతిపక్షం... విమర్శలు, ఎదురుదాడి... వ్యంగ్యోక్తులు... ఆరోపణలు... మొత్తంగా ఇదీ నెల్లూరు నగర పాలక సంస్థ బడ్జెట్ సమావేశం.**

బుధవారం నగరపాలక సంస్థ కార్యాలయంలోని డాక్టర్ ఏపిజె అబ్దుల్‌కలాం సమావేశ మందిరంలో జరిగిన బడ్జెట్ సమావేశంలో కొన్ని మార్పులు, చేర్పులు అనంతరం 666.18 కోట్లతో 2016-17 సంవత్సరం వార్షిక బడ్జెట్‌ను కౌన్సిల్ ఆమోదించింది. సమావేశంలో ప్రతిపక్ష సభ్యులు పి.రూప్‌కుమార్‌యాదవ్, ద్వారకానాథ్, బొబ్బల శ్రీనివాసయాదవ్‌లతో పాటు స్వపక్ష సభ్యులు కిన్నెర ప్రసాద్, మామిడాల మధులు మేయర్‌కు చుక్కలు చూపించారు. బడ్జెట్‌లోని అంశాల మీద విపక్ష సభ్యులు విపరీతంగా దాడి చేశారు.

హడ్కో నిధులు.. ఆ తర్వాత జైకా నిధులు... అసలు పనులకు టెండర్లు ఎప్పుడు పిలుస్తున్నారు, ఎప్పుడు పూర్తి చేస్తున్నారంటూ పి.రూప్‌కుమార్‌యాదవ్ నిలదీశాడు. బడ్జెట్ అంకెలగారడీని తలపిస్తుందని విపక్షసభ్యులు ఆరోపించారు. రాజకీయ కక్షలతో సిబ్బంది బదిలీలు జరుగుతున్నాయంటూ స్వపక్ష కార్పొరేటర్లు కిన్నెర ప్రసాద్, మధు మండిపడ్డారు. బడ్జెట్ సమావేశంలో స్వపక్ష, విపక్ష సభ్యులు మేయర్‌పై తీవ్రంగా దాడి చేసినా, కొందరు అధికారపార్టీ కార్పొరేటర్లు మేయర్‌కు అండగా నిలవడం విశేషం.

# అమరావతికి మైథిలి విద్యార్థుల విరాళం




నెల్లూరు చంద్రమౌళినగర్‌లోని మైథిలి ఇంగ్లీషు మీడియం స్కూలు విద్యార్థులు అమరావతి రాజధాని నిర్మాణానికి 10వేల రూపాయలను పాఠశాల వ్యవస్థాపకులు బి.మనోహర్‌రెడ్డి ద్వారా నెపస్మా నెల్లూరు నగర అధ్యక్షులు సౌరెడ్డి, జిల్లా కోశాధికారి వై.మల్లిఖార్జునరెడ్డిలకు అందజేశారం. నవ్యాంధ్ర రాజధాని నిర్మాణంలో తాము సైతం భాగస్వామ్యం అవుతామని పిల్లలు ముందుకొచ్చారని, ఇది ఎంతో ఆనందించదగ్గ విషయమని ఈ సందర్భంగా మనోహర్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అజంతా స్కూల్ కరస్పాండెంట్ వెంకటేశ్వరరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.




Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Ph:2323485. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Executive Editor-**G.SREENIVASULU REDDY**. e-mail: roopagroup@yahoo.com